


రంపచోడవరంలో అటెన్షన్..

రంపచోడవరం ఏరియా ఆసుపత్రి వద్ద టెన్షన్ నెలకొంది. మంగళవారం ఉదయం ఎన్‌కౌంటర్‌లో మృతిచెందిన హిడ్మా సహా ఆరుగురు మావోయిస్టుల మృతదేహాలను అక్కడే భద్ర పరిచారు.బుధవారం కుటుంబీకులు, బంధువులు రావడంతో పోస్టుమార్టం ప్రక్రియ ప్రారంభించారు. హిడ్మా,ఆయన భార్య రాజే మృతదేహాలకు హిడ్మా సోదరుడు ముయా, రాజే సోదరుడు హెలిస్ సమక్షంలో పోస్టుమార్టం పూర్తిచేశారు. మంగళ, బుధవారం ఎన్‌కౌంటర్లలో మరణించిన మిగిలిన వారికి గురువారం పోస్టుమార్టం చేస్తారు.





అడవిలో.. అలజడి

గిరిజనుల్లో భయం భయం

అల్లూరి జిల్లా మారేడుమిల్లి అటవీ ప్రాంతంలో జరిగిన ఎన్‌కౌంటర్ల జరిగిన సమీప గ్రామాల్లో 'ఆంధ్రజ్యోతి' బృందం బుధవారం పర్యటించింది. అయితే ఇక్కడ సాధారణ వాతావరణమే నెలకొంది. చాలా మందికి ఎన్‌కౌంటర్ తమకు సమీపంలోనే జరిగిందనే సమాచారం కూడా తెలీదు. మారేడుమిల్లి మండల కేంద్రంలోనే అలాంటి వాతావరణం కనిపించలేదు. కానీ మంగళవారం ఎన్‌కౌంటర్ జరిగిన నెల్లూర్ సమీప నివాసిత ప్రాంతంలోనూ, బుధవారం ఎన్‌కౌంటర్ జరిగిన గుజ్జుమామిడి వలస (జీఎం వలస) పంచాయతీలోనూ ఇదే విషయం చర్చించుకుంటున్నారు. కొండపోడు వ్యవ సాయం, కల్లు చెట్టు గీతకు ప్రతిరోజూ వేకువజామునే ఆయా అటవీ మార్గాల్లో సంచరించే గిరిజనులు ఈ ఘటనతో తీవ్ర భయభ్రాంతులకు గురయ్యారు.

మారేడుమిల్లికే ఎందుకు?

- రెండో రోజూ పేలిన తూటాలు
- టెక్ శంకర్ సహా ఏడుగురు మృతి
- ఆపరేషన్ సంభవ్ సక్సెస్
- కొనసాగుతున్న కూంబింగ్
- రంపచోడవరం ఆసుపత్రికి సీన్
- భారీగా భద్రత బలగాల పహారా

(రంపచోడవరం/మారేడుమిల్లి)

అడవిలో అలజడి రేగింది. గత రెండు రోజులుగా ప్రశాంతంగా ఉండే మారేడుమిల్లి ఫారెస్ట్ లో తూటాల శబ్దాలు.. కేంద్ర, రాష్ట్ర భద్రతా దళాల బూట్ల హడావుడితో తెలియని భయం నెలకొంది. ఇక్కడ వరుసగా జరిగిన రెండు ఎన్‌కౌంటర్లతో రేపు ఏం జరుగుతుందోననే ఆందోళన కలిగిస్తున్నాయి. మావోయిస్టు అగ్రనేత హిడ్మా, ఆయన భార్య రాజే సహా మొత్తం ఆరుగురు మంగళవారం నాటి ఎన్‌కౌంటర్లో హతమైన సంగతి తెలిసిందే. దేశవ్యాప్తంగా సంచలనం కలిగించిన ఈ ఘటన జరిగి 24 గంటలు దాటక ముందే బుధవారం వేకువజామున జరిగిన మరో ఎన్‌కౌంటర్ హడలెత్తించింది. మొదటి ఎన్‌కౌంటర్ మారేడుమిల్లి మండలంలోని నెల్లూరులో జరగ్గా.. ఆరుగురు మృతి చెందారు.. ఇదే మండలంలోని జీఎం వలస గ్రామంలో రెండో ఎన్‌కౌంటర్ జరగ్గా ఏడుగురు మృతి చెందారు. గత రెండు రోజులుగా వందలాది భద్రతా దళాల రాకపోకలతో రంపచోడవరం-మారేడుమిల్లి ఏజెన్సీ హడావుడిగా మారింది. మృతదేహాలు భద్రపరిచిన రంపచోడవరం ఏరియా ఆసుపత్రి వద్ద భద్రతా దళాలు పహారాగా ఉన్నారు. ప్రతి ఒక్కరి రాకపోకలను నిరంతరం వీరు పర్యవేక్షిస్తున్నారు.ఏరియా ఆసుపత్రికి వచ్చిన మృతుల బంధువులు విడిగా కూర్చొని ఉండేలా జాగ్రత్తలు తీసుకున్నారు.ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ప్రతి విషయంలోనూ గోప్యత పాటిస్తున్నట్టుగా ఇక్కడి పరిస్థితి నెలకొంది.

రంపచోడవరం ఏజెన్సీలో దాదాపు రెండు దశాబ్దాల నుంచి నక్సల్స్ జాడలు తగ్గిపోయాయి. ఈ ఏడాది ఏడు నెలల్లో నాలుగు ఎన్‌కౌంటర్లు జరగడంతో పాటు బుధవారం నాటికి 18 మంది మావోయిస్టులు హతమయ్యారు. ఈ ఏడాది వై.రామవరం మండలం అటవీ ప్రాంతంలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో ఇద్దరు, జూన్‌లో మారేడుమిల్లి మండలం కింటుకూరు అడవుల్లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో ముగ్గురు మావోయిస్టులు మృతిచెందారు. మంగళవారం నాటి ఎన్‌కౌంటర్‌లో ఆరుగురు,బుధవారం నాటి ఎన్‌కౌంటర్‌లో ఏడుగురు మృతి చెందారు. ఛత్తీస్‌గఢ్ నుంచి సురక్షిత ప్రాంతమైన మారేడుమిల్లి ఏజె న్సీకి మావోయిస్టు లు తరలివస్తున్నారని స్వయంగా జిల్లా ఎస్పీ బర్దర్ వెల్లడించడంతో మళ్లీ మావోయిస్టుల ప్రభావంపై చర్చ జరుగుతోంది.మారేడుమిల్లి ఏజెన్సీలోకిమావోయిస్టులు..ముఖ్యనేతలు వస్తున్నారంటే ఇప్పటికే ఇక్కడ అనువైన వాతావరణం ఏర్పాటుచేసుకుని ఉండొచ్చనే వాదన వినిపిస్తోంది.దీంతో నిఘా వర్గాలు రంగంలోకి దిగాయి. కూంబింగ్ నిరంతరం సాగేలా భద్రతా దళాలకు ఆదేశాలు అందుతున్నాయి.

సెంట్రల్ జైలుకు 40 మంది

రాజమహేంద్రవరం/కాకినాడ/రావులపాలెం,నవంబరు 19 (ఆంధ్ర జ్యోతి): పోలీసులు మంగళ, బుధవారాల్లో రాష్ట్రంలోని విజయవాడ,ఏలూరు, సామర్లకోట, రావులపాలెంలలో అదుపు లోకి తీసుకున్న మావోయిస్టులను రాజమహేంద్రవరంలోని కేం ద్ర కారాగారం, ప్రత్యేక మహిళా కారాగారాలకు కోర్టు ఆదేశాలతో రిమాండ్‌కు తరలించారు. ఏలూరులో పట్టుబడిన 10 మంది, విజయవాడలో నలుగురు, రావులపాలెంలో అరెస్టు చేసిన ఒకరిని కలిపి 15మందిని రాజమహేంద్రవరం సెంట్రల్ జైలుకు తరలించాలని ఆయా కోర్టులు బుధవారం ఆదేశించా యి. విజయవాడ, ఏలూరు, కాకినాడలో అరెస్టు చేసిన 29 మంది మహిళలను ప్రత్యేక మహిళా కారాగారానికి తర లిం చాలని ఆదేశించాయి. ఇప్పుడు రిమాండుకు ఇచ్చిన 40 మం దిపై ఉపా చట్ట ప్రకారం కూడా కేసులు నమోదు చేశారు. దీంతో వీళ్లను మిగతా ఖైదీలతో కలవకుండా ఉంచాల్సి ఉంటుంది. ఇప్పటికే జైలు 1300 మందితో కిక్కిరిసి ఉండడం, గదుల కొరత ఉండడంతో వీళ్లను ఎక్కడ ఉంచుతారో అనే సందిగ్ధం నెలకొంది.

సామర్లకోట నుంచి ఇద్దరు



కాకినాడ జిల్లా సామర్లకోట మండలం కొప్పవరంలో పట్టుబడిన ఇద్దరు మహిళా మావోయిస్టులను పోలీసులు బుధవారం సామర్లకోట సీఐ కృష్ణభగవాన్ నేతృత్వంలో మహిళా ఎస్ఐ, మరికొంత మంది ఎస్కార్ట్ సిబ్బంది మేజిస్ట్రేట్ కోర్టులో హాజరుపరిచారు. కోర్టులో కేసు పత్రాల సమర్పించిన అనంతరం జడ్జి షేక్ షరీన్ 14 రోజులు రిమాండ్ విధించారు. దీంతో వారిని రాజమహేంద్రవరం సెంట్రల్ జైలుకు తరలించారు. పట్టుబడిన ఇద్దరు మహిళా మావోయిస్టుల పేర్లు అనూష, అంకితగా చెబుతున్నారు. మహిళా మావోయిస్టుల్లో ఒకరు మాత్రమే న్యాయమూర్తి మాటలకు సమాధానమిచ్చారు.

రావులపాలెంలో హిడ్మా అనుచరుడు



రావులపాలెం,నవంబరు 19(ఆంధ్రజ్యోతి): కోనసీమ జిల్లా రావులపాలెంలో మావోయిస్టు హిడ్మా అనుచరుడు సరోజ్ మడివి అలియాస్ ఓండాను పోలీసులు అరెస్టు చేసినట్టు రావులపాలెం సీఐ ఎం.శేఖర్‌బాబు తెలిపారు. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని సుక్మా జిల్లా కృష్ణరాం పోలీస్‌స్టేషన్ పరిధిలోని గుర్గేలంకకు చెందిన సరోజ్ మడివి 12వ ఏట మావోయిస్టుల కార్యకలాపాలకు ఆకర్షితుడయ్యాడు. నిఘా వర్గాల సమాచారంతో మంగళవారం రాత్రి రావులపాలెం గౌతమి వంతెన సమీపంలోని డంపింగ్‌యార్డు వద్ద పోలీసులు అరెస్టు చేశారు. తుపాకీతో పాటు పది తూ టాలు స్వాధీనం చేసుకున్నామని తెలిపారు.

2 ఎన్‌కౌంటర్లు..13 మంది హతం : ఎస్పీ

ఆపరేషన్ సంభవ్ పేరిట ఈ కూంబింగ్ జరిగింది. మొదటి రోజు తప్పించుకున్న మావోయిస్టుల కోసం గాలిస్తుండగా బుధవారం తెల్లవారుజామున భద్రతా దళాలకు ఎదురుపడడం, వెంటనే జరిగిన ఎదురుకాల్పుల్లో టెక్ శంకర్ సహా ఏడుగురు మావోయిస్టులు హతమయ్యారు. ఈ రెండు ఎన్‌కౌంటర్లకు సంబంధించి మొత్తం 13 మంది మావోలు మరణించారు.


Tech Shanka

తెల్లవారుజామున శబ్దాలు : నారాయణరెడ్డి, జీఎం వలస

తెల్లవారు జామున నాలుగు గంటలకు అటవీ ప్రాంతం నుంచి భారీ శబ్దాలు వినిపించాయి. తొలుత పర్యాటకులెవరో సందడి చేస్తున్నారని భావించాం. వరుస భారీ పేలుళ్ల శబ్దాలతో భయపడ్డాం. కొద్దిసేపటికి పోలీసులు వచ్చి ఎవరు అటవీ ప్రాంతం వైపుగానీ, చేను పాకల వైపు రావొద్దని హెచ్చరించడంతో భయాందోళనకు గురయ్యాం.






సమిశ్రగూడెంలో నిరసన

నిడదవోలు, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): శివాలయం, రేవు ధ్వంసానికి ఆర్వోబీ నిర్మాణ పనులు చేపడుతున్న కాంట్రాక్టరే బాధ్యుడని సరైన వివరణ నష్టపరిహారం చెల్లించేవరకు పనులు నిలుపుదల చేయాలని సమిశ్రగూడెం గ్రామస్థులు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం గ్రామంలోని పురాతన శివాలయం వద్ద పనులను నిరసిస్తూ నిరసన వ్యక్తం చేశారు. పురాతన శివాలయం, రేవు ధ్వంసానికి ఆర్వోబీ కాంట్రాక్టర్ ,అధికారుల నిర్లక్ష్య వైఖరే కారణమన్నారు. సరైన వివరణ ఇచ్చి నష్టపరిహారం చెల్లించే వరకు శివాలయం పరిసరాల్లో పనులు నిలుపుదల చేయాలని డిమాండ్ చేశారు.



రజకుల ఆందోళన

గోపాలపురం, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : తమ ఉపాధి కోసం కేటాయించిన చెరువు సమీపంలో శివాలయం నిర్మాణానికి అనుమతించేది లేదని సద్గొండకి చెందిన రజకులు బుధవారం సచివాలయం వద్ద బైఠాయించారు. దీనిలో భాగంగా సిబ్బందిని సచివాలయంలోకి వెళ్లకుండా అడ్డుకున్నారు. దీంతో సర్పంచ్ ఎండపల్లి శేఖర్‌బాబు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్ఐ మనోహర్ తన సిబ్బందితో చేరుకుని రజకులతో మాట్లాడారు. అనంతరం రజక సంఘం అధ్యక్షుడు కొంజార ఏడుకొండలు, ఉపాధ్యక్షుడు అడవి పోసియ్య సచివాలయ కార్యదర్శి అరుణకు వినతిపత్రం అందజేశారు.



మహిళలు ఏర్పాటు చేసిన కూరగాయల స్టాల్స్ పరిశీలించి.. అన్నదాత సుఖీభవ నమూనా చెక్ అందజేస్తున్న మంత్రి నిమ్మల, కలెక్టర్ కీర్తి చేకూరి, ఎమ్మెల్యే మద్దిపాటి

టీడీపీలోనే రైతు సంక్షేమం

అన్నదాత సుఖీభవ చెక్కుల పంపిణీలో మంత్రి నిమ్మల రామానాయుడు

దేవరపల్లి, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : రైతుల సంక్షేమానికి ఎన్డీఏ ప్రభుత్వం ఎంతో కృషి చేస్తుందని జిల్లా ఇన్‌ఛార్జ్ మంత్రి, రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు పేర్కొన్నారు. దేవరపల్లి మండలం గౌరీపట్నంలో బుధవారం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు అధ్యక్షతన నిర్వహించిన అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. గత వైసీపీ ప్రభుత్వం వ్యవసాయరంగాన్ని పూర్తిగా నిర్వీర్యం చేసిందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సూపర్-6 హామీల్లో భాగంగా ప్రతి రైతుకు రూ.20 వేలు ఆర్థిక సాయం అందిస్తున్నారన్నారు. రెండో విడతలో భాగంగా కేంద్ర ప్రభుత్వం రూ.2 వేలు, రాష్ట్ర ప్రభుత్వం రూ.5 వేలు చొప్పున రైతుల ఖాతా ల్లో జమ చేయడం జరిగిందన్నారు. రైతు సంక్షేమం టీడీపీతోనే సాధ్యమన్నారు.ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు మాట్లాడుతూ గోపాలపురం నియోజకవర్గం 65 శాతం వ్యవసాయ రంగంపై ఆధారపడి ఉందన్నారు. నియోజకవర్గంలో 33 వేల కుటుంబాలకు రూ.7 వేలు చొప్పున అన్నదాత సుఖీభవ నిధులు జమయ్యాయని పేర్కొన్నారు.కలెక్టర్ కీర్తి చేకూరి మాట్లాడుతూ రైతులంతా వరికి ప్రత్యామ్నాయంగా పామాయిల్ సాగు చేసుకుంటే ప్రభుత్వం ప్రోత్సాహకాలు అందిస్తుందన్నారు. ఆర్గానిక్ వ్యవసాయ వల్ల ఖర్చు తక్కువ.. లాభం ఎక్కువ ఉంటుందన్నారు. మండల టీడీపీ అధ్యక్షుడు ఆండ్రూ అనీల్ మాట్లాడుతూ కొవ్వాడ కాల్వ కారణంగా గౌరీపట్నం పంటపొలాలు ప్రతీ ఏటా మునిగిపోయేవని ఈ ఏడాది రూ.70 లక్షలతో పూడికతీత పనులు చేపట్టడంతో సమస్య పరిష్కారమైందని మంత్రి రామానాయుడుకు కృతజ్ఞతలు తెలిపారు. గౌరీపట్నం, ధర్మవరం కాల్వ మధ్య బ్రిడ్జి నిర్మించాలని మంత్రిని కోరారు. అనంతరం రైతులు ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి డి.సువర్ణరాజు, ప్రత్యేకాధికారి భాగ్యవతి, డీఆర్‌సీ ఏడీ జయలక్ష్మి, నాయకులు గన్నమని హరికృష్ణ, ముళ్లపూడి దొరాజీచౌదరి, ఉప్పులూరి రామారావు, కొయ్యలమూడి చినబాబు, పెనుమత్స సుబ్బరాజు,జిల్లా వ్యవసాయాధికారులు మాధవరావు,తాతారావు,దేవరపల్లి ఏవో కే.కమలరాజు, తహశీల్దార్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఆసుపత్రి నిర్మాణంపై చర్చకు సిద్ధమా

నిడదవోలు మాజీ ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడికి మంత్రి దుర్గేష్ సవాల్

నిడదవోలు, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : నిడదవోలు ప్రభుత్వాసుపత్రిని వంద పడకల ఆసుపత్రిగా తీర్చిదిద్దే విషయమై ఉమ్మడి వేదికపై చర్చించేందుకు సిద్ధమని రాష్ట్ర మంత్రి కందుల దుర్గేష్ సవాల్ చేశారు. నిడదవోలులో బుధవారం ఆయన విలేకరు లతో మాట్లాడారు. వైసీపీ మాజీ ఎమ్మెల్యే జి.శ్రీనివాస్ నాయుడు అజ్ఞానంతో కేంద్రం నుంచి అనుమతులు తీసుకొచ్చామని గొప్పలు చెప్పుకుంటున్నారన్నారు. నిజంగా అనుమతులు తెస్తే సంబంధిత పత్రాలు చూపించాలని డిమాండ్ చేశారు. ప్రజల అనుమానాలు తీర్చేందుకు ఉమ్మడిగా వేదికపై చర్చిద్దామన్నారు. వంద పడకల ఆసుపత్రి నిర్మాణానికి అనుమతులు తీసుకొస్తే సరికాదని ఫైనాన్స్ శాంక్షన్ కూడా రావాలన్నారు. ఒక రాయి వేసి వంద పడకల ఆసుపత్రిగా మార్చేశామని ప్రజలను మభ్యపెట్టడం సరి కాదన్నారు. ఇటీవల మాజీ ఎమ్మెల్యే జి.శ్రీనివాస్ నాయుడు తాను కొత్తగా ఎమ్మెల్యే అయ్యానంటూ మాట్లాడిన వ్యాఖ్యలను గుర్తు చేస్తూ తాను విద్యార్థి దశ నుంచే రాజకీయాల్లో ఉన్నానన్నారు. 2007 నుంచి 2013 వరకు ఆరేళ్ల పాటు ఎమ్మెల్సీగా పదవీ బాధ్యతలు నిర్వహించి ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టానని తెలిపారు. అప్పటికి శ్రీనివాస్ నాయుడు ఎక్కడున్నారో తెలుసుకోవాలన్నారు. సీఎం చంద్రబాబు కేబినెట్‌లో మంత్రిగా పనిచేస్తున్నానని ఇది తన రాజకీయ పరంపరకు ఉదాహరణ అన్నారు. కొత్తగా వచ్చానని కొత్తగా ఎమ్మెల్యేనయ్యానని లాంటి మాటలు వినియోగించడం శ్రీనివాస్ నాయుడు అవివేకమన్నారు. అజ్ఞానంతో మాట్లాడొద్దని మంత్రి దుర్గేష్ హితవు పలికారు.


విలేకరులతో మాట్లాడుతున్న మంత్రి దుర్గేష్

7
డబ్బుల కోసమే బాలిక కిడ్నాప్
గంట పడుకుని నిద్రలేస్తానని..

ప్లా - ఎన్‌సీడీ ప్రారంభం

రాజమహేంద్రవరం అర్బన్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో అసంక్రమిత వ్యాధుల నివారణ, నియంత్రణకు పార్టిసిపేటరీ లెర్నింగ్ అండ్ యాక్షన్ (ప్లా - ఎన్‌సీడీ) అనే వినూత్న కార్యక్రమం ప్రారంభించినట్టు డీఎంహెచ్‌వో డాక్టర్ కె.వెంకటేశ్వరరావు తెలిపారు. ఈ మేరకు బుధవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి కార్యాలయం లో ప్లా - ఎన్‌సీడీ ప్రారంభించామన్నారు. దీనిలో భాగంగా రక్తపోటు, మధుమేహం, నోటి కేన్సర్, స్తన కేన్సర్, గర్భాశయ గర్భధార కేన్సర్ వంటి ప్రధాన అసంక్రమిత వ్యాధులపై దృష్టి సారించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఇమ్యునైజేషన్ అధికారిణి డాక్టర్ శ్రీదేవి, ఇతర వైద్యాధికారులు పాల్గొన్నారు.

అనంతపల్లిలో గంజాయి

నల్లజర్ల నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): మం డలం అనంతపల్లి టోల్‌ప్లాజా వద్ద గంజాయి రవాణా చేస్తున్న వాహనాన్ని నల్లజర్ల పోలీసులు బుధవారం పట్టుకున్నట్టు తెలిసింది. విశాఖ నుంచి హైదరాబాద్ వెళ్తున్న వాహనంలో రవాణా అవుతున్నట్టు సమాచారం రావడంతో నల్లజర్ల పోలీసులు టోల్‌ప్లాజా వద్ద సీఐ రాంబాబు ఆధ్వర్యంలో తనిఖీలు ప్రారంభించగా, విశాఖ నుంచి వెళ్తున్న వాహనంలో 150 కేజీల గంజాయి ఉన్నట్టు గుర్తించారు. దీనిపై సీఐను వివరణ కోరగా పూర్తి విచారణ జరిపిన అనంతరం వివరాలు తెలియజేస్తామన్నారు.



మాట్లాడుతున్న మంత్రి నారాయణ చిత్రంలో ఎమ్మెల్యేలు గోరంట్ల, వాసు, బత్తుల , రుడా చైర్మన్ బీవీఆర్ చౌదరి, కమిషనర్, జేసీ

పుష్కర పనులకు ప్రతిపాదనలు సిద్ధం చేస్తే నిధులిస్తాం

పురపాలక శాఖ మంత్రి నారాయణ

రాజమహేంద్రవరం సిటీ, నవంబరు19(ఆంధ్రజ్యోతి): గోదావరి పుష్కరాలు-2027 పనులకు ప్రతిపాదనలు సిద్ధం చేసి పంపిస్తే నిధులు మంజూరు చేయిస్తామని రాష్ట్ర పుర పాలక శాఖ మంత్రి పి.నారాయణ అన్నారు. రాజమహేంద్రవరం కార్పొరేషన్ కార్యాలయం లో బుధవారం అధికారులు, ప్రజాప్రతినిధుల తో సమీక్షించారు. పుష్కరాలకు వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకోవాలన్నారు.బొమ్మూరు జాతీయ రహదారి నుంచి సరస్వతి ఘాట్ వరకు 80 అడుగుల రోడ్డు నిర్మాణానికి రూ.100 కోట్లు అవసరమవుతాయని చెప్పారు. రాజమహేంద్రవరంలో మొత్తం 862 కిలోమీటర్ల డ్రెయినేజీకి ఇప్పటికి 527 కిలోమీటర్లు నిర్మించారని ఇంకా 303 కిలోమీటర్ల నిర్మాణం జరగాల్సి ఉందన్నారు. వీటిలో తొలిప్రాధాన్యతగా 180 కిలోమీటర్ల మేర డ్రెయినేజీ నిర్మించాలని గుర్తించి రూ. 75 కోట్లు నిధుల అంచనాలు సిద్ధం చేశామన్నారు. టీడీఆర్ బాండ్లు 40 పెండింగ్‌లో ఉన్నాయని ఈ నెలాఖరునాటికి అవి క్లియర్‌చేయాలని అధికారులను ఆదేశించారు. భూసేకరణకు సంబంధించి బాండ్లను 21 రోజుల్లో పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. బీపీఎస్, ఎల్ఆర్ఎస్ స్కీమ్‌లను వినియోగించుకోకపోతే అక్రమ కట్టడాలను కూల్చివేయ డం జరుగుతుందని హెచ్చరించారు. ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు మాట్లాడుతూ నగరంలో రూ. 300 కోట్లతో వివిధ ప్రాంతాల్లో అభివృద్ధి పను లు జరుగుతున్నాయన్నారు. పుష్కరాల అభి వృద్ధి పనులు చరిత్రలో నిలిచేలా ఉంటాయ న్నారు. కాతేరు 4వ బ్రిడ్జి సమీపంలో ఘాట్లను నిర్మించాలని, నగరంలో ఉన్న ఘాట్ల అనుసంధాన ప్రక్రియ జరగాలన్నారు. రాజమహేంద్రవరం, రూరల్, రాజానగరం నియోజకవర్గాల పరిధిలో పుష్కర అభి వృద్ధి పనులు, గోదావరి స్నానాల రేవుల నిర్మాణాలు, డ్రెయినేజీ, రహదారుల నిర్మాణాలపై రుడా ప్లానింగ్ ఆఫీసర్ మూర్తి డిజిటల్ ప్రజంటేషన్ ఇచ్చారు. వాటిలో స్వల్ప మార్పులను మంత్రి నారాయణ, ఎమ్మెల్యేలు గోరంట్ల బుచ్చయ్యచౌదరి, ఆదిరెడ్డి వాసు, బత్తుల బలరామకృష్ణ సూచించారు. కేంద్ర జలశక్తి శాఖ ప్రకటించిన జల్‌సంచాయ్ అవార్డుతో పాటు రూ.2 కోట్లు నగదు బహుమతి, జాతీ య స్థాయిలో నాల్గో ర్యాంక్ రావడంపై మంత్రి అభినందనలు తెలిపారు. రాజమహేంద్రవరంలో మురునీటి పారుదలకు సంబంధిం చి డ్రెయినేజీ వాటర్ గోదావరి దిగువన కలిసేవిధంగా చేపట్టిన ప్రాజెక్టు వివరాలను ఇంజనీరింగ్ విభాగం నుంచి ఇన్‌చార్జి ఎస్ఈ రీటా, ఈఈ మదర్సాఆలీలు వివరించారు.ఈ కార్యక్రమంలో జేసీ మేఘా స్వరూప్,కమిషనర్ రాహుల్ మీనా తదితరులు పాల్గొన్నారు.

కుస్తీ మే సవాల్



విజయవాడలో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో సత్తా చాటుతున్న సురేఖ (ఎరుపు జెర్సీ)

ఆదివాసీ బిడ్డ కుస్తీ మే సవాల్ అంటోంది. బరిలో ఎవరున్నా పతకం నాదే అంటోంది. గిరిజన గూడెంలో పుట్టి న ఈమె కుస్తీ పోటీల్లో ఎదుటివారిని మట్టికరిపిస్తోంది. జిల్లా, రాష్ట్ర స్థాయిల్లో సత్తాచాటి జాతీయ స్థాయిలోనూ పతకం సాధిస్తానని ధీమా వ్యక్తం చేస్తోంది.



స్వర్ణ పతకంతో సురేఖ

(చింతూరు-ఆంధ్రజ్యోతి)

- సత్తా చాటుతున్న సురేఖ
- రాష్ట్ర స్థాయిలో స్వర్ణ పతకం కైవసం
- జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక
- అల్లిగూడెం నుంచి న్యూఢిల్లీకి ఆదివాసీ బిడ్డ క్రీడా ప్రస్థానం

అల్లూరి జిల్లా చింతూరు మండలం అల్లిగూడేనికి చెందిన మడకం సురేఖ వరరామచంద్రపురం మండలం సోములగూడెం ఆశ్రమ పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతోంది. ఈమెకు ఫిజికల్ డైరెక్టర్ పూరి శివ కొద్ది నెలలుగా కుస్తీ పోటీలకు శిక్షణ ఇస్తున్నారు. అక్టోబరు 4న కాకినాడలో జరిగిన జిల్లా స్థాయి అండర్-14 పోటీల్లో పాల్గొన్న సురేఖ మొత్తం 60 మందిలో సత్తా చాటి బంగారు పతకం కైవసం చేసుకుంది. ఈ నెల 4, 5, 6 తేదీల్లో విజయవాడలో జరిగిన రాష్ట్ర స్థాయి కుస్తీ పోటీల్లోనూ ఆమె ప్రతిభ కనబరిచింది. 52 మంది పాల్గొనగా విజేతగా నిలిచి మరో బంగారు పతకాన్ని సొంతం చేసుకుంది. వచ్చే ఏడాది జనవరి మొదటివారంలో న్యూఢిల్లీలో జరిగే జాతీయ స్థాయి కుస్తీ పోటీలకు ఎంపికైంది. బిర్సా ముండా 150వ జయంతి సందర్భంగా సోములగూడెం ఆశ్రమ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు పండా సునీత, డిప్యూటీ వార్డెన్ మడకం భద్రమ్మ, ఉపాధ్యాయులు సురేఖను ఘనంగా సన్మానించారు.

సురేఖ తల్లిదండ్రులు ఆనంద్, ఊర్వశి. వీరిది అతి పేద కుటుంబం. చిన్నపాటి వ్యవసాయమే జీవనాధారం. పొద్దంతా పొలం పనులు చేసుకోవడం, అటవీ ఉత్పత్తులు సేకరించి అమ్మగా వచ్చిన సొమ్ములతో కుటుంబాన్ని వెళ్లదీస్తున్నారు.



బిర్సా ముండా జయంతి సందర్భంగా సురేఖను సన్మానించిన ఆశ్రమ పాఠశాల ఉపాధ్యాయులు





జాతీయ స్థాయి పోటీకి సాధన చేస్తున్న సురేఖ (నీలం రంగు షర్టు)

నేను సాధించలేనిది నా కూతురు సాధించింది

సురేఖ తండ్రి ఆనంద్



నాకు క్రీడలంటే ప్రాణం. చింతూరులోని ఏపీ రెసిడెన్షియల్ స్కూల్లో 9వ తరగతి చదివినప్పుడు జిల్లా స్థాయిలో 800 మీటర్ల పరుగు పందెంలో పాల్గొని విజయం సాధించాను. ఆపై అనారోగ్యంతో చదువుతో పాటు క్రీడా రంగానికి కూడా దూరమయ్యాను. ఇపుడు నా కూతురు రాష్ట్ర స్థాయిలో బంగారు పతకం సాధించి జాతీయ స్థాయి పోటీలకు సిద్ధమవుతుండడం.. ఆమెకు పీడీ, ఉపాధ్యాయులు సహకరించడం ఎంతో సంతోషంగా ఉంది. నేను సాధించలేనిది నా కూతురు సాధిస్తుంటే పట్టలేనంత ఆనందంగా ఉంది.

ఉపాధ్యాయుల తోడ్పాటుతోనే సాధ్యమైంది: సురేఖ

పాఠశాల ఉపాధ్యాయులు నా ప్రతిభను గుర్తించి కుస్తీలో శిక్షణ ఇస్తున్నారు. వారి నమ్మకాన్ని ఒమ్ము చేయకుండా జిల్లా, రాష్ట్ర స్థాయి పోటీల్లో బంగారు పతకాలు సాధించాను. ఉపాధ్యాయులే స్వయంగా సన్మానించడం నాకెంతో గర్వంగా ఉంది. నాలో పట్టుదలను మరింత పెంచింది.

జాతీయ స్థాయిలో పతకమే లక్ష్యం

పూరి శివ, సోములగూడెం ఆశ్రమ పాఠశాల ఫిజికల్ డైరెక్టర్



సురేఖపై నాకు నమ్మకం ఉంది. ఆమె ప్రదర్శనే ఇందుకు నిదర్శనం. జాతీయ స్థాయిలో బంగారు పతకం సాధనకు శక్తి వంచన లేకుండా కష్టపడుతున్నాం. తద్వారా రాష్ట్రంలో గుర్తింపు పొందడంతో పాటు ఆదివాసీ బిడ్డ మరింత ఉన్నత స్థాయికి చేరుకునే అవకాశం ఉంటుంది.

బిడ్డకి మిఠాయిలు ఇచ్చి వచ్చాము



సురేఖ తల్లి ఊర్వశి

సోములగూడెం వెళ్లి మా బిడ్డను చూసి వచ్చాము. మిఠాయిలు కొనిచ్చి వచ్చాము. ధైర్యం చెప్పాము. పీడీ, ఉపాధ్యాయులు సురేఖను సొంత బిడ్డలా చూసుకుంటున్నారు. జాతీయ స్థాయిలో గెలవాలని మొక్కుకుంటున్నా.



పోటీలను ప్రారంభిస్తున్న కోనసీమ జిల్లా డీఈవో సలీంబాషా

ఇందుపల్లిలో ఉమ్మడి జిల్లా స్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీలు

అమలాపురం రూరల్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): స్కూలు గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఇందుపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా స్థాయి పవర్‌లిఫ్టింగ్ పోటీలు నిర్వహించారు. పాఠశాల హెచ్‌ఎం లంక రాణి ఆధ్వర్యంలో జరిగిన పోటీలను జిల్లా విద్యాశాఖాధికారి డాక్టర్ షేక్ సలీంబాషా ప్రార ంభించారు. ఆయన మాట్లాడుతూ క్రీడాకారులు ప్రభుత్వ ఉద్యోగాలు పొందేందుకు ప్రభుత్వం ప్రత్యేక క్రీడా కోటాను అమలుచేస్తుందన్నారు. జాతీయస్థాయి క్రీడా పోటీల్లో రాణిస్తూ ఉద్యోగ అవకాశాలు దక్కించుకోవాలని సూచించారు. బాలుర, బాలికల విభాగంలో వేర్వేరుగా నిర్వహించిన పవర్‌లిఫ్టింగ్ పోటీలకు న్యాయ నిర్ణేతలుగా కంకిపాటి వెంకటేశ్వరరావు, మట్టపర్తి వెంకటసముద్రం, జి.గణేష్‌బాబు, యనమదల శ్రీనివాసరావు, షేక్ వలీసాహెబ్ వ్యవహరించారు. సాయంత్రం వరకు జరిగిన ఈ పోటీల్లో ఉమ్మడి జిల్లాస్థాయిలో ప్రథమస్థానం సాధించిన పవర్ లిఫ్టర్లను రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేసినట్టు తెలిపారు.

విజేతలు వీరే..

ప్రతిభ చాటి రాష్ట్రస్థాయికి ఎంపికైన క్రీడాకారుల వివరాలు ఇలా ఉన్నాయి. 53 కిలోల విభాగంలో సీహెచ్ సత్యగోపాల్ (ఇందుపల్లి), 59 కిలోల విభాగంలో డి.అనిల్ (భీమనపల్లి), 66 కిలోల విభాగంలో ఎంఎన్వీ అవినాష్ (సాకుర్రు), 74 కిలోల విభాగంలో జి.దినేష్‌ప్రసాద్ (ముక్కామల), 83 కిలోల విభాగంలో ఎం.దుర్గారామగణేష్ (అమలాపురం), 93 కిలోల విభాగంలో వై.యశ్వంత్‌సుజిత్‌కుమార్ (ముక్కామల), 105 కిలోల విభాగంలో ఎస్కేఎస్ఎస్ మణికంఠ (శానపల్లిలంక) విజేతలుగా నిలిచారు. బాలికల విభాగంలో 43 కిలోల విభాగంలో కె.లక్ష్మీకీర్తన భీమనపల్లి, 47 కిలోల విభాగంలో టి.కీర్తి (రాజోలు), 52 కిలోల విభాగంలో కె.శిరీష (ఇందుపల్లి), 57 కిలోల విభాగంలో యు.షానిక (రాజోలు), 63 కిలోల విభాగంలో పి.స్పందన (రాజోలు), 69 కిలోల విభాగంలో ఎం.సంకీర్తనాదేవి (పాలమూరు), 76 కిలోల విభాగంలో వై.ఇందిర (గొల్లవిల్లి), 84కిలోల విభాగంలో వి.మేఘనశ్రీ (భీమనపల్లి) విజేతలుగా నిలిచారు. వీరికి డీఈవోతో పాటు జిల్లా అధికారి డాక్టర్ ఎంఏకే భీమారావు, గుబ్బల పెద్దిరాజు, కామన మధు పతకాలు అందజేశారు.

వర్క్‌షాప్‌లతో ఆవిష్కరణలపై ఆసక్తి

జేఎన్టీయూకే, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): వర్క్‌షాప్‌లలో పాల్గొనడం ద్వారా అధ్యాపకులు, విద్యార్థుల్లో పరిశోధనా నైపుణ్యం, ఆవిష్కరణలపై ఆసక్తి పెరుగుతుందని జేఎన్టీయూకే ఉపకులపతి ప్రొఫెసర్ సీఎస్ఆర్కే ప్రసాద్ తెలిపారు. జేఎన్టీయూలోని ఈసీఈ గ్యాలరీలో బుధవారం ట్రాన్స్‌ఫార్మింగ్ ది ఫ్యూచర్ ఆఫ్ రీసెర్చ్ విత్ ఐఈఈఈ అనే అంశంపై వర్క్‌షాప్ నిర్వహించారు. వీసీ పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి వర్క్‌షాప్‌ను ప్రారంభించారు. రిజిస్ట్రార్ ఆర్.శ్రీనివాసరావు, ప్రిన్సిపాల్ మోహన్‌రావు, ప్రొఫెసర్ శ్రీనివాసకుమార్, అధ్యాపకులు ఉన్నారు.



జ్యోతి ప్రజ్వలన చేసి వర్క్‌షాప్‌ను ప్రారంభిస్తున్న వీసీ ప్రసాద్

కొక్కొరోకో సినిమా సందడి

● తూర్పుపాలెంలో పలు సన్నివేశాలు చిత్రీకరణ

మలికిపురం, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): మలికిపురం మండల పరిధిలోని తూర్పుపాలెంలో కొక్కొరోకో సినిమా షూటింగ్ సందడి నెలకొంది. బుధవారం సంక్రాంతి పండుగకు సం బంధించిన కొన్ని సన్నివేశాలను చిత్రీకరించారు. ఈ సందర్భంగా తూర్పుపాలెంలోని మండువా లోగిళ్లను రంగవల్లులు, పూలదండులు, అరటిచెట్లతో శోభాయమానంగా ముస్తాబు చేశారు. పౌరాణిక వేషధారణలతో నటీనటులు వీధుల్లో సందడి చేశారు. గ్రామీణ ప్రాంత వాతావరణ నేపథ్యంలో సినిమాను చిత్రీకరిస్తున్నట్టు సినిమా నిర్వాహకుడు రమేష్ వర్మ తెలిపారు. ఆర్వీ ఫిల్మ్ హౌస్ నీలాద్రి ప్రొడక్షన్స్ సమర్పణలో చిత్రీకరణ జరుగుతోందన్నారు. శ్రీనివాస్ వసంతాల దర్శకుడిగా రేఖావర్మ, శిరీష కొర్రపాటి నిర్మాతలుగా వ్యవహరిస్తున్నారు. నటీనటులుగా సముద్రఖని, సునీల్, మురళీకృష్ణ, సప్తగిరి పమ్మిసాయి, ప్రవీణ్, ప్రియాంక, గోపిక ఉదయం, ప్రతీ నేహ ఉన్నారు. ఎడిటర్‌గా ప్రవీణ్ పూడి, కెమెరామెన్‌గా ఆకాశ్ ఉండగా సంగీతాన్ని కృష్ణప్రసాద్ పనిచేస్తున్నారు.



ఓ సన్నివేశాన్ని తెరకెక్కిస్తున్న దృశ్యం

గోవా ఫిలిం ఫెస్టివల్ జ్యూరీ సభ్యుడిగా 'నామాన' నియామకం

కరప, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): గోవాలో ఈనెల 20 నుంచి 28వ తేదీ వరకు భారత అంతర్జాతీయ చలన చిత్రోత్సవ వేడుక (ఐఎఫ్ఎఫ్ఐ-2025) జరగనుంది. ఇందులో భాగంగా నిర్వహించే హాకథాన్/ఏఐ ఫిలిం ఫెస్టివల్ విభాగానికి జ్యూరీ సభ్యుడిగా కాకినాడ జిల్లా కరప మండలం పెనుగుదురు గ్రామానికి చెందిన దర్శక, నిర్మాత నామాన రామదాసునాయుడు ఎంపికయ్యారు. ఈ మేరకు కేంద్ర సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ నుంచి ఉత్తర్వులు అందాయి. నాలుగు దశాబ్దాలుగా సినీ, టీవీ రంగాల్లో దర్శక, నిర్మాతగా రాణిస్తున్న రామదాసునాయుడు ఆంధ్రప్రదేశ్ నంది అవార్డుల జ్యూరీ మెంబర్‌గా, ఇంట ర్నేషనల్ చిల్డ్రన్ ఫిలిం ఫెస్టివల్ కమిటీ మెంబరుగా, ఏపీ ఫిలిం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా సేవలందించారు. ఆయా విభాగాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్ర ప్రభుత్వం నుంచి 10 నంది అవార్డులు అందు కున్నారు.రామదాసునాయుడు సేవలను గుర్తించిన కేంద్రప్రభుత్వం తాజాగా ఐఎఫ్ఎఫ్ఐ-2025 ఏఐ ఫిలిం సెక్షన్‌కు జ్యూరీ మెంబరుగా నియమించింది. ఆయనకు గ్రామస్థులు, అభిమానులు, పలువురు రాజకీయ నాయకులు, సినీ ప్రముఖులు అభినందనలు తెలిపారు.



రామదాసునాయుడు

22న నన్నయలో జాతీయ సెమినార్

దివాన్‌చెరువు, నవంబరు19 (ఆంధ్రజ్యోతి): ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం నైపుణ్యాభివృద్ధి కేంద్రం, భౌతికశాస్త్ర విభాగం సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 22వ తేదీన జాతీయ సెమినార్ నిర్వహిస్తున్నట్టు ఉప కులపతి ఆచార్య ఎస్.ప్రసన్నశ్రీ తెలిపారు. దీనికి సంబంధించిన బ్రోచర్‌ను బుధవారం ఆమె ఆవిష్కరించారు. అనంతరం వీసీ మాట్లాడుతూ భౌతిక శాస్త్రంలో ఇటీవల పరిణామాలు, అభివృద్ధి చెందుతున్న సాంకేతికతలు అనే అంశంపై సైన్స్ అండ్ టెక్నాలజీ కళాశాల ఆధ్వర్యంలో సెమినార్ జరుగుతుందన్నారు. కార్యక్రమం కన్వీనర్‌గా బి.జగన్మోహన రెడ్డి, కో-కన్వీనర్‌గా ఎస్.రాజ్యలక్ష్మి వ్యవహరిస్తారన్నారు. అధ్యాపకులు, పరిశోధకులు ఈసెమినార్‌ను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య కేవీ స్వామి, ప్రిన్సిపాల్ పి.విజయనిర్మల, తదితరులు పాల్గొన్నారు.



బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న నన్నయ వీసీ ప్రసన్నశ్రీ, వర్సిటీ అధికారులు

కాకినాడ జీజీహెచ్‌లో వృద్ధులకు ప్రత్యేక ఓపీ సేవలు

23న ప్రారంభం

జీజీహెచ్ (కాకినాడ), నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జీజీహెచ్‌లో 65 ఏళ్లు పైబడిన వృద్ధుల సౌలభ్యం కోసం ప్రతి ఆదివారం ప్రత్యేక ఓపీ సేవలు అందుబాటులోకి రానున్నాయి. ప్రస్తుతం జనరల్ మెడిసిన్‌కు సంబంధించిన వైద్యసేవలు ఈనెల 23న ప్రారంభం కానున్నాయి. కాకినాడ జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ చొరవతో జీజీహెచ్‌లో పనిచేసిన మెడిసిన్ విభాగ నిష్ణాతులు డాక్టర్ ఎంబీఆర్ శర్మ, డాక్టర్ కేఎస్ఆర్ స్వామి, డాక్టర్ సీఎస్ఎస్ శర్మ, డాక్టర్ రమణ్‌రావుతో కలిసి జీజీహెచ్ వైద్యులు షిఫ్టుల విధానంలో సేవలు అందించనున్నారు. ప్రతి ఆదివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఓపీ నడుస్తుందని సూపరింటెండెంట్ డాక్టర్ ఎస్.లా వణ్యకుమారి తెలిపారు.

కాకినాడ జీజీహెచ్‌లో హృద్రోగ వ్యాధులకు రేపు స్క్రీనింగ్ పరీక్షలు

జీజీహెచ్ (కాకినాడ), నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జీజీహెచ్‌లో ఈ నెల 21వ తేదీన 18 ఏళ్లలోపు వయసు గల పిల్లలకు గుండె వ్యాధికి సంబంధించి స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహిస్తామని కాకినాడ జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ జె.నరసింహనాయక్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రీయ బాల స్వస్థ్య (ఆర్‌బీఎస్‌కే)లో భాగంగా విజయవాడ ఇండో బ్రిటీష్ హాస్పిటల్ సౌజన్యంతో జీజీహెచ్‌లోని డిస్ట్రిక్ట్ ఎర్లీ ఇంటర్వెన్షన్ సెంటర్లో పరీక్షలు జరుగుతాయన్నారు. ఎవరికైనా గుండె వ్యాధి ఉందని నిర్ధారణ అయితే వెంటనే ఇండో బ్రిటీష్ హాస్పిటల్ వైద్యులు వారికి ఉచితంగా శస్త్ర చికిత్స చేయిస్తారని తెలిపారు. కార్యక్రమాన్ని ఆర్‌బీఎస్‌కే జిల్లా ప్రోగ్రాం అధికారి డాక్టర్ వి. అరుణ పర్యవేక్షిస్తారని డీఎంహెచ్‌వో చెప్పారు.

కేంద్ర మంత్రి సతీమణి పూజలు



చిత్రపటం అందజేస్తున్న ఈవో నీలకంఠం

సామర్లకోట, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): కేంద్రసహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ సతీమణి వెంకటేశ్వరీదేవి, ఆమె కుటుంబ సభ్యులు బుధవారం కాకినాడ జిల్లా సామర్లకోటలోని భీమేశ్వరస్వామి ఆలయానికి విచ్చేశారు. వారికి ఈవో బళ్ల నీలకంఠం, ధర్మకర్తల మండలి చైర్మన్ కంటే జగదీష్ మోహన్ (బాబు), వేదపండితులు సాదర స్వాగతం పలికారు. భీమేశ్వర స్వామికి అభిషేకం, బాలాత్రిపురసుందరి అమ్మవారికి విశేష కుంకుమార్చనలు జరిపారు.

వాడపల్లి వెంకన్న ఆలయ అభివృద్ధికి కృషి

● విశాఖ ఎంపీ శ్రీభరత్

ఆత్రేయపురం, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయ అభివృద్ధికి తన వంతు కృషిచేస్తానని విశాఖపట్నం ఎంపీ ఎం. శ్రీభరత్ పేర్కొన్నారు. బుధవారం కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావుతో కలిసి ఆయన స్వామివారిని దర్శించుకున్నారు. తొలుతగా అర్చక బృందం వేదమంత్రాలతో ఘనస్వాగతం పలికింది. అనంతరం స్వామివారిని దర్శించుకుని వేదపండితుల ఆశీర్వచనం అందుకున్నారు. ఎంతో మహిమాన్వితుడైన స్వామి వారు దేశవ్యాప్తంగా ఖ్యాతిని అర్జించారని ఆలయ అభివృద్ధికి ప్రభుత్వం ఎంతగానో కృషిచేస్తుందన్నారు. స్వామివారి అభివృద్ధిలో తనవంతు కృషి చేస్తానన్నారు. అనంతరం ఆలయ వద్ద రూ.1.16 కోట్లతో నిర్మిస్తున్న టెన్‌జల్ షెడ్ నిర్మాణానికి ఎంపీ, ఎమ్మెల్యే కలిసి శంకుస్థాపన చేశారు. అలాగే నూతనంగా ఏర్పాటు చేసిన 108 అంబులెన్స్‌ను ప్రారంభించారు. కేంద్రప్రభుత్వం ప్రసాదం స్కీమ్ రూ.96 కోట్ల నిధుల విడుదలకు తనవంతు కృషిచేస్తానని ఎంపీ పేర్కొన్నారు. రాష్ట్రంలోని ప్రముఖ దేవాలయాలలో వాడపల్లి ఆ స్థాయిలో అభివృద్ధి సాధించడం తథ్యమన్నారు.కార్యక్రమంలో రాష్ట్ర బీసీ కోఆపరేటివ్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ రెడ్డి అనంతకుమారి, ఆముడా చైర్మన్ అల్లాడ స్వా మినాయుడు, దేవస్థానం చైర్మన్ ముదునూరి వెంకట్రాజు, ఆకుల రామకృష్ణ, ఉప కమిషనరు నల్లం సూర్యచక్రధరరావు, తదితరులు పాల్గొన్నారు.



ఆలయాన్ని సందర్శిస్తున్న ఎంపీ భరత్, ఎమ్మెల్యే బండారు, తదితరులు

హుండీ ఆదాయం రూ.1.59 కోట్లు

ఆలయంలో భక్తులు సమర్పించిన హుండీ కానుకలను బుధవారం లెక్కించారు. పర్యవేక్షణాధికారులు వి.సత్యనారాయణ, జె.రామలింగేశ్వరరావు, వైవీవీ సత్యనారాయణల పర్యవేక్షణలో జరిగింది. మొత్తం 27 రోజులకు గాను రూ.1,30,38,579, అన్నప్రసాద హుండీల ద్వారా రూ.29,06,170 వెరసి రూ.1,59,44,749 లభించింది. అలాగే బంగారం 15 గ్రాములు, వెండి 910 గ్రాములు, పలు దేశాల విదేశీ కరెన్సీ నోట్లు హుండి ద్వారా లభించించిన్నట్టు ఆలయ ఉపకమీషనరు నల్లం సూర్యచక్రధరరావు తెలిపారు. ఈ లెక్కింపులో అర్చకులు, గ్రామస్థులు, సిబ్బంది, బ్యాంకు,పోలీసులు, తదితరులు పాల్గొన్నారు.

హుండీ లెక్కింపులో చేతివాటం

ఆలయ సన్నిధిలో బుధవారం నిర్వహించిన స్వామివారి హుండీ లెక్కింపులో ఓ సేవకుడు స్వామివారి నగదు తస్కరించాడు. వివిధ ప్రాంతాల నుంచి సేవకులు వస్తుంటారు. కానుకలు లెక్కిస్తున్న సమయంలో ద్రాక్షారామానికి చెందిన వాసంశెట్టి శ్రీనివాసరావు అనే సేవకుడు రూ.60 వేల నగదు దొంగలిస్తుండగా ఆలయ సెక్యూరిటీ గార్డు పట్టుకుని దేవస్థానం అధికారులకు అప్పగించారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తునట్టు ఎస్ఐ ఎస్.రాము తెలిపారు.

మత్స్యకారుల వ్యాపారాభివృద్ధికి ప్రభుత్వం అండ : మంత్రి దుర్గేష్

నిడదవోలు, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): దేశంలో మత్స్యకారుల ఆదాయాన్ని రెట్టింపు చేసే లక్ష్యంతో మత్స్య రైతులు, మత్స్యకారులను సహకార సంఘాల నుంచి సమృద్ధి వైపు నడిపించేందుకు ప్రధాన మంత్రి మత్స్య సంపద యోజన ద్వారా వారికి ఆర్థిక భరోసా కల్పిస్తున్నామని రాష్ట్ర మంత్రి కందుల దుర్గేష్ తెలిపారు. బుధవారం నిడదవోలు పట్టణంలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో కోరుమామిడి దివడ్డీస్ ఫిషర్‌మెన్ కో ఆపరేటివ్ సొసైటీకి రూ. 2.54 లక్షల చెక్కును అందించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ వంద మంది కన్నా ఎక్కువ ఉన్న మత్స్యకార సొసైటీలకు సంఘ కార్యకలాపాల కోసం సంవత్సరానికి రూ. 2.5 లక్షలు ఇస్తున్నామని తెలిపారు. సీఎం చంద్రబాబు , డిప్యూటీ సీఎం పవన్ ఆదేశాలతో ఈ సొసైటీకి ఖర్చుల నిమిత్తం నిధులు రావడం జరిగిందన్నారు. రాష్ట్రంలో ఇదే ప్రథమమని ఆయన తెలిపారు. ఈ నిధుల ద్వారా కార్యాలయ నిర్మాణానికి, ఫర్నిచర్ ఏర్పాటుకు, మేనేజ్మెంటు చేసే సిబ్బంది వేతనానికి వినియోగించుకోవచ్చన్నారు. ప్రతి మత్స్యకారుడు నేషనల్ ఫిషరీ డెవలప్మెంట్ ప్లాట్‌ఫామ్‌లో రిజిస్టర్ అయివుండాలని, అలా అయివున్నవారికి వ్యక్తిగత రుణాలు, క్రెడిట్ గ్యారంటీ సదుపాయం అందుతుందన్నారు. కార్యక్రమంలో కోరుమామిడి మత్స్యకార సంఘాల ప్రతినిధులు, అధికారులు, కూటమి నాయకులు, తదితరులు పాల్గొన్నారు.



నిడదవోలులో పీఎం మత్స్య సంపద యోజన చెక్కును అందిస్తున్న మంత్రి కందుల దుర్గేష్

రాష్ట్ర స్థాయి కబడ్డీ, ఖోఖో పోటీలకు విద్యార్థుల ఎంపిక



రాష్ట్ర స్థాయికి ఎంపికైన క్రీడాకారుడితో ఉపాధ్యాయులు

సామర్లకోట, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): మచిలీపట్నంలో ఈనెల 22వ తేదీ నుంచి 24 వరకు జరిగే రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు సామర్లకోట ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థి ఎం.వెంకట శ్రీరామ్ ఎంపికయ్యాడని ఆ పాఠశాల హెచ్‌ఎం కె.ప్రసన్న, వ్యాయామ టీచర్ బి.శివ తెలిపారు. బుధవారం వీరిద్దరు మాట్లాడుతూ అలాగే అయోధ్యరామపురం మున్సిపల్ ఉన్నత పాఠశాలకు చెందిన ముగ్గురు విద్యార్థులు కూడా ఎంపికైనట్టు హెచ్‌ఎం తోటకూర సాయిరామకృష్ణ తెలిపారు. అండర్-14 కబడ్డీ బాలుర విభాగంలో కె.అభిరామ్, ఖోఖో బాలికల విభాగంలో జి.వర్షిణి, బాలుర విభాగంలో డి.గౌతమ్‌కుమార్ ఎంపికయ్యారు.

సత్యదేవా.. సంఖ్య తగ్గే!

- గతేడాది కార్తీకం కంటే ఈ ఏడాది తగ్గనున్న సత్యదేవుడి వ్రతాలు
- మొంథా తుఫాన్ ప్రభావంతో సుమారు 10 వేల వ్రతాల్లో కోత
- నేటితో ముగియనున్న కార్తీకమాసం

అన్నవరం, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా అన్నవరం సత్యదేవుడి సన్నిధిలో ఏటా కార్తీమాసంలో అధికసంఖ్యలో వ్రతాలు జరుగుతుంటాయి. అయితే ఈసారి మాత్రం ఆ సంఖ్య భారీగా తగ్గనుంది. తెలుగురాష్ర్టాల నుంచే కాకుండా వివిధ ప్రాంతాల నుంచి భక్తులు విచ్చేసి కార్తీకమాసంలో సత్యదేవుడి వ్రతాలు ఆచరిస్తారు. ఏడాదిలో జరిగే వ్రతాల్లో సుమారు 20 శాతం కార్తీకమాసంలో జరుగుతుండడం విశేషం. గతేడాది కార్తీకమాసంలో 1,45,732 వ్రతాలు జరగగా ఈ ఏడాది 1.50 లక్షలు జరుగుతాయని అధికారులు అంచనా వేశారు. గురువారంతో కార్తీకమాసం ముగియనుండగా బుధవారంతో 133644 వ్రతాలు జరగగా గతేడాది కంటే 12088 వ్రతాల లోటులో ఉంది. గురువారం అమావాస్య కారణంగా కేవలం 2వేల వ్రతాలు జరి గే అవకాశాలు ఉన్నాయి. మొత్తంమీద గతేడాది కంటే సుమారు 10 వేల వ్రతాల లోటు కనిపిస్తుంది. దీనికి ప్రధాన కారణం కార్తీకమాసం ప్రారంభంలో మొంథా తుఫాన్ ప్రభావం పడింది. ఈ తుఫాన్ భయంకరంగా ఉంటుందని, కాకినాడ ప్రాంతంలో తీరం దాటుతుందని హెచ్చరికల నేపథ్యంలో భక్తులు వెనకడుగు వేశారు. ఆ సమయంలో భక్తులు పూర్తిస్థాయిలో వచ్చి ఉంటే 1.50 లక్షలు వ్రతాలు జరిగి గతేడాది రికార్డును అధిగమించే అవకాశం ఉండేది. కానీ అలా జరగకుండా వ్రతాల సంఖ్య తగ్గింది.



వ్రతాలు ఆచరిస్తున్న భక్తులు (ఫైల్)

అడవి నుంచి జనావాసాల్లోకి..

- 'ఆపరేషన్ కగార్' ధాటికి 'తూర్పు' వైపునకు చేరిన మావోలు
- గతేడాది జూన్‌లో గుడిసె పరిసరాల్లో రహస్య సమావేశం
- అప్పటి నుంచి వారి కదలికలపై కేంద్ర బలగాల ప్రత్యేక నిఘా

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

'ఆపరేషన్ కగార్‌'తో మావోయిస్టు పార్టీ కకావికలం అయిపోయింది. చివరి మావోయిస్టును కూడా హతం చేసి ఆ పార్టీని తుదముట్టించాలని కేంద్రం గట్టిగానే నిర్ణయం తీసుకొంది. దీంతో ఆక్టోపస్, గ్రేహౌండ్స్, సీఆర్పీఎఫ్.. ఇలా అత్యంత చురుకుదనం కలిగిన నిఘా వర్గాలను రంగంలోకి దింపింది. వాళ్లకు అధునాతన ఆయుధ సంపత్తిని అందజేసింది. ఛత్తీస్‌ఘడ్ అడవుల్లోని గిరిజన గ్రామాలను, వ్యక్తులకు జియోట్యాగింగ్ చేశారంటే ఏ స్థాయిలో మావోయిస్టులను చుట్టుముట్టారో అర్థం చేసుకోవచ్చు. ఆపరేషన్ కగార్‌ను డిసెంబరు చివరి నాటికి ముగించాలని కేంద్రం ఆదేశించింది. అడిషనల్ డీజీ మహేశ్ చంద్ర లడ్డా నేతృత్వంలో అనుకున్న పనిని పది రోజులకు ముందే కానిచ్చేశారు. ఆపరేషన్ కగార్ ధాటికి అన్నలు అడవిని వీడి జనారణ్యంలోకి వచ్చేశారు. ఈ నేపథ్యంలోనే ఏలూరు, విజయవాడ, రావులపాలెం, సామర్లకోట తదితర ప్రాంతాల్లో కొందరు పోలీసులకు చిక్కినట్టు సమాచారం. దీంతో సరిహద్దులో ఎవరున్నారు? జనంలో ఎవరు కలిసి తిరుగుతున్నారు? ఎప్పుడు ఏం జరుగుతుందనే ప్రతిష్టంభన రాజ్యమేలుతోంది. నక్సల్‌బరీ ఉద్యమం తొలి నాళ్లలో ఉమ్మడి తూర్పుగోదావరిలోని మారేడుమిల్లి, రంపచోడవరం, గంగవరం, అడ్డతీగల, వై.రామవరం, రాజవొమ్మంగి మండలాల్లో పోరుబాట ఉధృతంగా ఉండేది. రాత్రివేళల్లో సంచరించడానికి కూడా పరిస్థితులు భయపెట్టేవి. ఆ తర్వాత ఏపీ ప్రభుత్వం ఉక్కుపాదం మోపడం, చర్చలు విఫలం కావడం వంటి పరిణామాలతో మావోలు ఏవోబీ వైపునకు, ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర, తెలంగాణలకు తరలిపోయారు.



● ఇదే జరిగిందా?

ఆపరేషన్ కగార్‌లో భాగంగా ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర, తెలంగాణ రాష్ర్టాల్లో నక్సలైట్ల ఏరివేతలను ఉధృతం చేశారు. దీంతో వాళ్లు మళ్లీ ఆంధ్రానే షెల్టర్ జోన్‌గా ఎంచుకున్నారు. హిడ్మా కూడా ఓ వైపు లొంగిపోతానని సంకేతాలు పంపుతూనే తన పని తాను చేసుకుపోతున్నాడు. కొద్దినెలలక్రితం త్వరలోనే తాను లొంగిపోతాన ని, మధ్యవర్తిత్వం సాగించాలని ఓ విలేకరికి వర్తమానం పంపినట్లు చెప్తున్నారు. ఈ క్రమం లోనే గత జూన్, జూలై నెలల్లో మారేడుమిల్లి సమీపంలోని ప్రముఖ పర్యాటక ప్రాంతమైన గుడిసెకు దగ్గరలోని అడవుల్లో మావోయిస్టుల కీలక సమావేశం జరిగింది. ఆ నెలల్లో గుడిసెలో నిర్వహణ, రోడ్ల మరమ్మతుల నిమిత్తం పర్యాటకులను ఆపేశారు. అదే అదనుగా అక్కడ బస చేసి మావోయిస్టులు సమావేశాలు నిర్వహించారు. వాళ్లు వెనుదిరిగిన వారం రోజుల తర్వాత పోలీసులకు ఈ విషయం తెలిసింది. దీంతో రంగంలోకి దిగి ఆరా తీశారు. మావోయిస్టులకు ఆహారం, ఇతర వస్తువులు సరఫరా చేసిన వాళ్లపై కేసులు పెట్టారు. వాటిని పోలీసులు బయటకు రానివ్వలేదని తెలిసింది. దీన్ని వ్యూహంలో భాగం చేశారు. ఆపరేషన్ కగార్‌లో టాప్ లీడర్లపైనే దృష్టిసారించారు. వాళ్లను అంతమొందిస్తూ వస్తున్నారు. జూన్, జూలై నెలల్లో వందల సంఖ్యలో మావోయిస్టులు పోలీసుల చేతుల్లో చనిపోయారు. టాప్ లీడర్లు కలుగులోంచి బయటకు వస్తున్నారని గుడిసె సమావేశం తర్వాత పోలీసులు అంచనాకు వచ్చారు. ఈ క్రమంలో కాకినాడ పోర్టు నుంచి శ్రీలంకకు మాడ్వి హిడ్మా, అతడి భార్య, మరో ముగ్గురు నలుగురు ముఖ్యులు వెళ్లే ప్లాన్ వేశారు. ఆపరేషన్ కగార్ నేపథ్యంలో కొంతకాలంపాటు చడీచప్పుడు లేకుండా ఉండాలని వారు భావించి ఉండొచ్చని అంచనా వేస్తున్నారు. ఈనేపథ్యంలో హిడ్మా, అతడి భార్య, పదుల సంఖ్యలో వివిధ క్యాడర్లలోని మావోయిస్టులు విభజిత తూర్పు, కాకినాడ జిల్లాలకు పయనమయ్యారని తెలుస్తోంది. ఈ పయనంలో వాళ్లు ఉండగా.. అప్పటికే పక్కా సమాచారంతో ఉన్న కేంద్ర బలగాలు మాటువేసి వారిని ఎన్‌కౌంటర్ జరిగి ఉండొచ్చని భావిస్తున్నారు. మంగళవారం ఆరుగురు, బుధవారం ఏడుగురు మరణించగా.. మరో నలుగురు మావోయిస్టులు పోలీసుల చెరలో ఉన్నారని, వారిని హతమార్చడమా? అరెస్టు చూపించడమా? అనే సందిగ్ధంలో పోలీసులు ఉన్నారని తెలుస్తోంది.



స్వాధీనం చేసుకున్న గంజాయి, నిందితులతో చింతూరు పోలీసులు

తవుడు కింద గంజాయి బస్తాలు

- పట్టుకున్న చింతూరు పోలీసులు
- రూ.6 లక్షల విలువైన 120 కిలోల గంజాయితో ఇద్దరి అరెస్ట్

చింతూరు, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): చింతూరు పోలీసులు బుధవారం 120 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఎస్ఐ రమేష్ కథనం మేరకు... ఒడిస్సా రాష్ట్రం మల్కనగిరి జిల్లా ఎంవీ 71 గ్రామానికి చెందిన బిశ్వజిత్ మండల్, సుధీప్ హల్దార్ 120 కిలోల గంజాయిని ఏపీలోకి తరలించేయత్నం చేశారు. బొలేరా వాహనంలో తవుడు లోడు వేసుకుని ఆ లోడు కింద భాగంలో ఎవరికీ అనుమానం కలగకుండా గంజాయి బస్తాలను పేర్చారు. కాగా ఒడిస్సా జంక్షన్‌లో వాహన తనిఖీలు చేస్తున్న క్రమంలో గంజాయిని పోలీసులు పట్టుకున్నారు. గంజాయి తరలిస్తున్న నిందితులను అదుపులోకి తీసుకుని వాహనాన్ని స్వాధీనం చేసుకున్నామని ఎస్ఐ తెలిపారు. పట్టుబడిన గంజాయి విలువ రూ.6 లక్షల వరకు ఉంటుందన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

చింతూరు డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వోపై
వైద్యుల ఫిర్యాదులు

డిసెంబరు 4న విచారణ

చింతూరు, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): చింతూరు డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో డా.పుల్లయ్యపై పలువురు వైద్యులు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో డిసెంబరు 4న విచారణకు హాజరుకావాల్సిందిగా ఇరుపక్షాలకు ఆదేశాలు అందాయి. విచారణ చింతూరు ఐటీడీఏ కార్యాలయంలో జరగనుంది. చింతూరు డివిజనులోని కూనవరం, కూటూరు, తులసిపాకల, రేఖపల్లి, జీడిగుప్ప ప్రాథమిక వైద్యశాలల వైద్యాధికారులకు.. పుల్లయ్యకు నడుమ దాదాపు ఏడాదిగా పొసగడం లేదు. దీనిపై ఎవరి వాదన వారిదిగా ఉంది. తాజాగా ఎటపాక మండలంలోని లక్ష్మీపురం ప్రాథమిక వైద్యశాల అధికారి, పుల్లయ్యకు నడుమ కూడా వివాదం రాజుకుంది. దీంతో లక్ష్మీపురం వైద్యాధికారి ఏకంగా విలేకర్ల సమావేశం ఏర్పాటు చేసి పుల్లయ్యపై పలు ఆరోపణలు చేసిన విషయం విదితమే. ఇదిలా ఉండగా కూటూరు, కూనవరం, రేఖపల్లి, తులసిపాకల, జీడీగుప్ప వైద్యులు డైరక్టర్ ఆఫ్ పబ్లిక్ హెల్త్ ఫ్యామిలీ వెల్ఫేర్ జాయింట్ డైరక్టర్ (డీపీహెచ్‌ఎఫ్ డబ్ల్యు)కు పుల్లయ్యపై లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. అధికార దుర్వినియోగం, వేధింపులు, బెదిరింపులు, మానసిక హింస, ప్రాథమిక సేవా హక్కులతో కూడిన, గౌరవాన్ని తిరస్కరించడం ప్రైవేటు ప్రయోజనాలకు ప్రభుత్వ సేవలను మళ్లించడం, ఆర్థిక దుష్ప్రవర్తన, ప్రతీకారం తదితర చర్యలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. ఈ మేరకు డీపీహెచ్‌ఎఫ్‌డబ్ల్యు స్పందించి విచారణకు ఆదేశించారు. విచారణ అధికారిగా నేషనల్ ప్రోగ్రాం ఫర్ కంట్రోల్ ఆఫ్ బ్లైండ్‌నెస్ అండ్ విజువల్ ఇంపెయిర్‌మెంట్ (ఎన్‌పీసీబీఐ) జాయింట్ డైరక్టర్ సునీల్‌కుమార్ నాయక్‌ను నియమించారు. ఆ మేరకు డిసెంబరు 4న విచారణ అధికారి చింతూరు రానున్నారు. విచారణ తదుపరి ఎటువంటి పరిణామాలు చర్యలు తీసుకుంటారో చూడాల్సింది ఉంది.

కుండలేశ్వరస్వామి దర్శనానికి వచ్చి
గుండెపోటుతో భక్తురాలు మృతి

కాట్రేనికోన, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): కుండలేశ్వరస్వామిని దర్శనానికి ఒక భక్తురాలు విశాఖ నుంచి బుధవారం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కాట్రేనికోన మండలం కుండలేశ్వరం వచ్చింది. స్వామిని దర్శించి అన్నప్రసాదాన్ని స్వీకరించింది. ఆలయం బయట కూర్చుని విశ్రాంతి తీసుకుంటూ గుండెపోటుతో మృతి చెందింది. ఈ ఘటన కుండలేశ్వర క్షేత్రంలో విషాదం నింపింది. వివరాల ప్రకారం.. విశాఖకు చెందిన బొట్టా నిర్మల (67) బుధవారం కుండలేశ్వరం వచ్చి గోదావరిలో స్నానమాచరించి ఎంతో భక్తితో స్వామిని ఆరాధించింది. అన్న ప్రసాదం తీసుకున్న తర్వాత ఆలయం వద్ద బయట కొద్దిసేపు విశ్రాంతి తీసుకునేందుకు కూర్చుంది. అకస్మాత్తుగా గుండెపోటు రావడంతో కుప్పకూలింది. అక్కడ ఉన్న భక్తులు, ఆలయ సిబ్బంది తక్షణం స్పందించినా ఫలితం లేకపోయింది. పవిత్ర కుండలేశ్వర స్వామి సన్నిధిలో తనువు చాలించిన నిర్మల అదృష్టానికి ఆనంద పడాలో, దైవదర్శనానికి వచ్చి మృత్యువాత పడినందుకు విచారించాలో తెలియని అయోమయ పరిస్థితిలో తోటి భక్తులు సతమతమయ్యారు.



వివరాలు వెల్లడిస్తున్న అమలాపురం సీఐ

డబ్బు కోసమే బాలిక కిడ్నాప్

- నిందితుడి అరెస్టు
- 14 రోజుల రిమాండ్
- వెల్లడించిన అమలాపురం సీఐ వీరబాబు

అమలాపురం, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురంలో ఇటీవల సంచలనం కలిగించిన బాలిక కిడ్నాప్ కేసులో నిందితుడిని అరెస్టు చేసినట్టు అమలాపురం సీఐ పి.వీరబాబు వెల్లడించారు. డబ్బు కోసమే బాలికను కిడ్నాప్ చేశాడని, నిందితుడిని న్యాయస్థానంలో హాజరుపరుచగా 14 రోజుల రిమాండ్ విధించారని పేర్కొన్నారు. ఈ కేసుకు సంబంధించి వివరాలు సీఐ వీరబాబు బుధవారం విలేకర్లకు వివరించారు. ఈనెల 10న అమలాపురంలో స్కూలు నుంచి వస్తున్న పదేళ్ల బాలికను వరుసకు మామయ్య అయిన మట్టపర్తి దుర్గానాగసత్యమూర్తి (చంటి) మోటారు సైకిల్‌పై వచ్చి కిడ్నాప్ చేసి కాకినాడ తీసుకెళ్లాడు. బాలికను క్షేమంగా అప్పగించాలంటే తాను పంపిస్తున్న యూపీఐ క్యూఆర్ కోడ్‌కు డబ్బులు పంపించాలని బాలిక తల్లిదండ్రులను బెదిరించి డబ్బులు వసూలు చేశాడు. అయితే బాలిక తండ్రి కముజు వెంకటరమణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన అమ లాపురం పట్టణ పోలీసులు డీఎస్పీ టీఎస్ఆర్కే ప్రసాద్ పర్యవేక్షణలో విచారణ కోసం బృందాలను ఏర్పాటు చేశారు. ఎస్ఐలు టి.శ్రీనివాస్, జోషి మూడు బృందాలుగా ఏర్పడి కాకినాడ, పి.గన్నవరం, ముంగండ, పోతవరం, కారుపల్లి గ్రామాల్లో ముమ్మరంగా గాలించారు. కిడ్నాప్ అయిన 11 గంటల్లోనే బాలిక ఆచూకీని గుర్తించి తల్లిదండ్రులకు క్షేమంగా అప్పగించారు. ఈ కేసులో ప్రధాన నిందితుడైన మట్టపర్తి దుర్గానాగసత్యమూర్తి అలియాస్ చంటిని పోతవరం గ్రామంలో బుధవారం సీఐ వీరబాబు పర్యవేక్షణలో ఎస్ఐ శ్రీనివాస్, సిబ్బంది అరెస్టు చేశారు. అతడి నుంచి నేరానికి ఉపయోగించిన మోటారు సైకిల్, 2 సెల్‌ఫోన్లు, బాలిక స్కూలు బ్యాగు, లంచ్‌బాక్సు, జత స్కూలు షూలు స్వాధీన పరచుకున్నారు. అతడిని అమలాపురంలో అడిషనల్ జ్యూడిషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టులో హాజరుపరచగా న్యాయమూర్తి 14 రోజుల రిమాండ్ విధించారని సీఐ తెలిపారు. నిందితుడిని రాజమహేంద్రవరం సెంట్రల్ జైలుకు తరలించారు. ఈ కేసును ఛేదించడంలో కృషి చేసిన ఎస్ఐలు, సిబ్బందిని సీఐ వీరబాబు అభినందించారు.

జాహ్నవి మృతదేహం లభ్యం



జాహ్నవి మృతదేహం

మలికిపురం, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): దిండి-చించినాడ వద్ద గోదావరిలో తండ్రి ఇద్దరు పిల్లలను తోసి ఆత్మహత్య చేసుకున్న విషయం తెలిసిందే. ఈ సంఘటనలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా లక్కవరం గ్రామానికి చెందిన తండ్రి శిరిగినీడి దుర్గాప్రసాద్, కుమారుడు మోహిత్ మృతదేహాలు మంగళవారం లభ్యం కాగా బుధవారం ఉదయం కుమార్తె జాహ్నవి మృతదేహం లభ్యమైంది. ముగ్గురి మృతదేహాలకు రాజోలు ప్రభుత్వాసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించి వారి కుటుంబ సభ్యులకు అందజేస్తామని పోలీసులు తెలిపారు. ఒకే కుటుంబంలోని ముగ్గురు మృతిచెందడం ఈ ప్రాంతవాసులను కలవరపరిచింది. ఘటనపై అనుమానాస్పద కేసుగా నమోదు చేసి దర్యాప్తు చేయనున్నట్టు మలికిపురం పోలీసులు తెలిపారు.

కాలువలో గుర్తు తెలియని మహిళ మృతదేహం

కడియం, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా ధవళేశ్వరం నుంచి కడియం వెళ్లే కాలువలో సుమారు 30 నుంచి 40 ఏళ్లు గల మహిళ మృతదేహం నీటిలో తేలియాడుతున్నట్టు బుధవారం స్థానికులు గుర్తించారు. పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారు మృతదేహాన్ని వేమగిరిగట్టు వద్ద ఒడ్డుకు తీయించి పరిశీలించారు. మృతదేహంపై వంగపూవు రంగు చీర, బ్లౌజు ఉన్నాయి. మెడలో నల్లపూసల తాడు, కాళ్లకు మెట్టెలు ఉండడంతో వివాహితగా పోలీసులు గుర్తించారు. వేమగిరి గ్రామ రెవెన్యూ అధికారి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కడియం పోలీసుస్టేషన్ హెడ్ కానిస్టేబుల్ ఎం.సురేష్ కేసు నమోదు చేశారు. మహిళ వివరాలు తెలిస్తే కడియం పోలీసుస్టేషన్‌కు తెలియపరచాలనికోరారు.

రాష్ట్రస్థాయి పోటీలకు అద్దరిపేట విద్యార్థి



రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన జగదీష్

తొండంగి, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి పరుగు పందెం పోటీలకు కాకినాడ జిల్లా తొండంగి మండలం అద్దరిపేట విద్యార్థి పిక్కి జగదీష్ ఎంపికైనట్టు ప్రధానోపాధ్యాయురాలు దుర్గాకుమారి తెలిపారు. ఈనెల 18న కాకినాడలో జరిగిన 300 మీటర్ల పరుగు పందెంలో జగదీష్ జిల్లాస్థాయిలో మొదటి స్థానంలో నిలిచ ఈనెల 29న విజయవాడలో జరిగే రాష్ట్రస్థాయిలో పోటీలకు ఎంపికయ్యాడన్నారు. రాష్ట్రస్థాయి పోటీల్లో విజేతగా నిలిచి జాతీయస్థాయిలో రాణించాలని ఆకాంక్షించారు. జగదీష్, వ్యాయామోపాధ్యాయులు మునుకోటి దుర్గాప్రసాద్‌ను అభినందించారు.

చోరీ కేసుల్లో నిందితుడికి ఆరు నెలల జైలు

కాకినాడ క్రైం, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనాలు దొంగిలిస్తూ దొరికిన వ్యక్తిపై నేరారోపణ రుజువు కావడంతో ఆరు నెలల జైలు శిక్ష విధిస్తూ కాకినాడ మూడో జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టు న్యాయమూర్తి డి.శ్రీదేవి బుధవారం తీర్పు చెప్పారు. కాకినాడ జిల్లా పిఠాపురానికి చెందిన 42 ఏళ్ల కాట్లోజు లోవరాజు గతంలో బంగారం పనిచేసేవాడు. సులువుగా డబ్బులు సంపాదించాలనే ఉద్దేశంతో ద్విచక్ర వాహనాలను తస్కరించడం ప్రారంభించాడు. ఈ క్రమంలో కాకినాడ జీజీహెచ్ ప్రాంగణంలో పార్క్ చేసిన మోటారు వాహనాలను ఎత్తుకెళ్లి అమ్ముకుని జల్సా చేసేవాడు. ఈ విధంగా ఏడు కేసుల్లో నిందితుడైన లోవరాజును కాకినాడ వన్‌టౌన్ పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. కోర్టులో వాదోపవాదనల అనంతరం అతడిపై నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి పై విధంగా తీర్పునిచ్చారు. ప్రాసిక్యూషన్ తరపున ఏపీపీ కె.సుధారాణి వాదించారు.

అంగన్‌వాడీకి వెళ్లి.. అంతలోనే కన్నుమూసి!

ఫిట్స్‌తో ఐదేళ్ల చిన్నారి మృతి



మృతిచెందిన చిన్నారి జనని

చింతూరు, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఫిట్స్ బారిన పడి ఐదేళ్ల చిన్నారి మృతి చెందింది. ఈ ఘటన అల్లూరి జిల్లా చింతూరు మండలంలోని కుయుగూరులో బుధవారం జరిగింది. ఎస్ఐ రమేష్ తెలిపిన వివరాల మేరకు.. పెద్దసీతనపల్లికి చెందిన శ్యామల మారయ్య, రమాదేవి దంపతుల కూతురు జనని (5) కుయుగూరులోని అమ్మమ్మ రవ్వ దుర్గమ్మ ఇంటి వద్దనే ఉంటూ అంగన్‌వాడీలో చదువు కుంటుంది. ఈ క్రమంలో బుధవారం సమీపంలోని అంగన్‌వాడీ సెంటరుకు వెళ్తూ మార్గంమధ్యలో రేగికాయల చెట్టు వద్ద కింద పడి ఉన్న పండ్లను ఏరుకుని తింటూ అంగన్‌వాడీ సెంటర్‌కు వెళ్లింది. కాగా కొద్ది నిమిషాల వ్యవధిలో జననికి ఫిట్స్ వచ్చాయి. విషయం తెలుసుకున్న జనని అమ్మమ్మ దుర్గమ్మ కుటుంబసభ్యులందరూ జననిని చింతూరు ఏరియా ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు జనని అప్పటికే మృతి చెందినట్టు ధ్రువీకరించారని ఎస్ఐ తెలిపారు.

గంట పడుకుని నిద్ర లేస్తానని చెప్పి..

- కాపవరంలో ఉరేసుకున్న యువకుడు
- కన్నీరుమున్నీరైన తల్లిదండ్రులు



నీలకంఠేశ్వరుడు మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్ఐ రవిచంద్రకుమార్

బిక్కవోలు, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా బిక్కవోలు మండలం కాపవరంలో పోసిన నీలకంఠేశ్వరుడు (26) ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. బిక్కవోలు ఎస్ఐ వి.రవిచంద్రకుమార్ తెలిపిన వివరాల ప్రకారం... కాపవరానికి చెందిన నీలకంఠేశ్వరుడు అనపర్తి ఐఎల్‌టీడీ ఫ్యాక్టరీలో కూలీ పని చేస్తుంటాడు. మంగళవారం పనికి వెళ్లి రాత్రి ఇంటికి వచ్చి పడుకున్నాడు. బుధవారం ఉదయం అతడి తల్లి నిద్రలేపగా రాత్రి లేటుగా వచ్చానని.. ఒక గంట పడుకుని లేస్తానని చెప్పి మళ్లీ పడుకున్నాడు. మళ్లీ నిద్ర లేపడానికి తల్లి ప్రయత్నించగా తలుపు వేసి ఉంది. దీంతో ఎంతకొట్టినా తలుపు తీయకపోవడంతో పగులగొట్టి చూడగా ఫ్యాన్‌కు ఉరివేసుకుని మృతి చెందాడు. నీలకంఠేశ్వరుడు మృతదేహాన్ని అనపర్తి ఏరియా ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసి మృతికి కారణాలపై దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ వివరించారు. మృతుడికి ముగ్గురు సోదరులు ఉన్నారు. వారికి పెళ్లిళ్లు అయిపోయాయి. నీలకంఠేశ్వరుడికి ఏ బాధలు లేవని, ఉరి వేసుకుని చనిపోవడానికి కారణాలు తెలియరావడం లేదని తల్లిదండ్రులు కన్నీరుమున్నీరయ్యారు.

విహారయాత్రలో విషాదం

కాలువలో యువకుడి గల్లంతు



జగదీష్ (ఫైల్)

మోతుగూడెం/చింతూరు, నవనంబరు 19 (ఆంధ్రజ్యోతి): పొల్లూరు జల విద్యుత్ ఉత్పాన కేంద్రానికి చెందిన కాలువలో మునిగి గనిశెట్టి జగదీష్(26) గల్లంతయ్యాడు. ఈ ఘటన బుధవారం అల్లూరి సీతారామరాజు జిల్లా చింతూరు మండలం మోతుగూడెంలో జరిగింది. పోలీసుల కథనం మేరకు... అనకాపల్లి జిల్లా ఎలమంచిలి నుంచి గనిశెట్టి జగదీష్, బీ.చిరంజీవి, కె.భాను, ఆర్.రాందేవ్, పీ.నాగేంద్ర, బీ.హరి మోతూ గూడెం జలపాతాల విహారయాత్రకు కారులో కలిసి వచ్చారు. మధ్యాహ్నం 3 గంటల ప్రాంతంలో వారంతా బోర్‌బే వద్దకు చేరుకున్నారు. తదుపరి జగదీష్, నరేంద్ర, భాను కాలువలో స్నానానికి దిగారు. కాలువ ప్రవాహం ఉధృతి అవుతుండడంతో జగదీష్ మినహా మిగిలిన ఇద్దరు ఒడ్డుకు చేరుకున్నారు. జగదీష్ కూడా ఒడ్డుకు చేరేందుకు ప్రయత్నం చేస్తుండగానే ప్రవాహంలో కొట్టుకుపోయాడు. మిగిలిన వారంతా జగదీష్‌ని రక్షించే ప్రయత్నం చేసినప్పటికీ ఫలితం లేకుండాపోయింది. సాయంత్రం 6 గంటల వరకు కాలువలో గాలించినప్పటికీ జగదీష్ ఆచూకీ లభ్యం కాలేదు. రాందేవ్, జగదీష్ బావ బామ్మర్దులు. రాందేవ్ మోతుగూడెం పోలీసు స్టేషనులో ఫిర్యాదు చేశాడు. కాగా వారంతా డ్రైవింగ్, మెకానిక్ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. జగదీష్ గల్లంతు కావడంతో ఎంతో విలపిస్తున్నారు.



విహారయాత్రలో స్నేహితులు దిగిన ఫొటో

రాత్రి లాడ్జిలో రూం తీసుకుని..
ఉదయం డ్రైనులో శవంగా కనిపించి..

- పురుగుల మందుల కంపెనీ ఉద్యోగి అనుమానాస్పద మృతి
- కేసు నమోదు చేసిన పోలీసులు

రాజమహేంద్రవరం, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): రాత్రి లాడ్జి రూం తీసుకున్న వ్యక్తి.. ఉదయానికి అదే లాడ్జి పక్కన డ్రైనులో శవమై కనిపించాడు. రాజమహేంద్రవరం త్రీటౌన్ ఎస్ఐ సుభాని తెలిపిన వివరాల ప్రకారం... నూజివీడుకు చెందిన టి.చెన్నారావు (38) ఓ పురుగుల మందుల కంపెనీలో ఉమ్మడి తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల అసిస్టెంట్ సేల్స్ మేనేజరుగా ఇటీవల ఉద్యోగంలో చేరాడు. విధుల్లో భాగంగా మంగళవారం పశ్చిమ గోదావరిలోని దుకాణాలకు వెళ్లి పని చూసుకుని సాయంత్రానికి మరొకరితో కలిసి రాజమండ్రి చేరుకున్నాడు. తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాలకు చెందిన బాధ్యులు ఇద్దరితో కలిసి రాత్రి 4వ అంతస్తులో ఉన్న రూంలో మద్యం తాగి ఉండొచ్చని ఎస్ఐ పేర్కొన్నారు. కారు డ్రైవర్లు వేరేక రూంలో నిద్రిస్తున్నారని, తెల్లవారుజామున 5.30గంటల ప్రాంతంలో చెన్నారావు బాల్కనీలోకి వచ్చి ప్రమాదవశాత్తు పడిపోయి ఉండొచ్చని ప్రాథమికంగా భావిస్తున్నామన్నారు. ఉదయం డ్రైనులో మృదేహాన్ని గమనించిన స్థానికుల సమాచారం మేరకు మార్చురీకి తరలించి అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశామన్నారు.



డ్రైనులో చెన్నారావు మృతదేహం

ఉలిగోగులలో భూ వివాదం

20 జీడిమామిడి చెట్లు నరికి వేత



ఉలిగోగులలో నరికి వేసిన జీడిమామిడి చెట్లు

ప్రత్తిపాడు, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా ప్రత్తిపాడు మండలంలోని సబ్‌ప్లాన్ ఏజెన్సీ బురదకోట పంచాయతీ పరిధిలో ఉన్న ఉలిగోగుల గిరిజన గ్రామంలో భూ వివాదం ఏర్పడింది. గిరిజనులు భూముల్లో పెంచుతున్న పెంచుకున్న 20 జీడిమామిడి చెట్లను గిరిజనేతరులు నరికి వేయడంతో బుధవారం ఈ వివాదం వచ్చింది. చెట్లు నరికివేత దారులు, గిరిజనుల మధ్య వివాదం కారణంగా ప్రత్తిపాడు పోలీసులు సంఘటనా స్థలానికి వచ్చారు. ఉలిగోగులలో కాహూరి లవకుశలు, కాహూరి వెంకటలక్ష్మి, సిద్ద బూరమ్మలు ఏళ్ల తరబడి సాగు చేసుకుంటున్న 20 ఎకరాల భూముల్లో రూ.10లక్షల విలువైన చేసే తమ జీడిమామిడి చెట్లను అన్యాయంగా నరికి వేశారని బాధితులు వాపోయారు. 20 ఎకరాల భూముల వివాదం కోర్టులో పెండింగ్‌లో ఉందని, ఈ భూమిపై హక్కులు కోర్టు నిర్ధారించుకుండానే గిరిజనేతరులు దౌర్జన్యాలకు దిగుతున్నారని వారు ఆందోళన వ్యక్తం చేశారు. దీంతో వివాదాస్పద భూముల్లో ఇరువర్గాల మధ్య ఘర్షణ వాతావరణం నెలకొనడంతో పోలీసులు సంఘటనా స్థలానికి తరలివచ్చారు.

రాజమహేంద్రవరం

• రాజమహేంద్రవరం సిటీ/ రూరల్ • రాజానగరం • అనపర్తి



తొర్రేడులో అన్నదాత సుఖీభవ చెక్కుల పంపిణీలో మాట్లాడుతున్న రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల

రైతు సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

● అన్నదాత సుఖీభవ సొమ్ముల పంపిణీలో ఎమ్మెల్యేలు గోరంట్ల, నల్లమిల్లి, బత్తుల

రాజమహేంద్రవరంరూరల్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): రైతు సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి అన్నారు. బుధవారం అన్నదాతసుఖీభవ, పీఎం కిసాన్ పథకం కింద రూరల్ నియోజకవర్గం పరిధిలోని 5302మంది రైతులకు రూ.3.92కోట్లు రైతులఖాతాలకు విడుదల చేశారు. ఈ సందర్భంగా రూరల్ మండలం తొర్రేడు ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘంలో జరిగిన కార్యక్రమంలో గోరంట్ల మాట్లాడుతూ గత ప్రభుత్వం ఏడాదికి రూ. 13,500 మాత్రమే రైతులకు చెల్లిస్తే ప్రస్తుత కూటమి ప్రభుత్వం ఏడాదికి పెట్టుబడి సాయం కింద రూ.20వేలు చెల్లిస్తోందన్నారు. ప్రకృతి విపత్తులు సంభవించినపుడు వెంటనే నష్టపరిహారం అందజేస్తున్నట్లు పేర్కొన్నారు. రైతుల సేంద్రీయ వ్యవసాయాన్ని ఆధునిక పద్ధతులతో చేసుకోవాలని వ్యవసాయ పనులకు డ్రోన్ వాడకాన్ని అలవాటు చేసుకోవాలన్నారు సొసైటీ ఛైర్ పర్సన్ దండమూడి బాపినీయుడు, పర్సన్లు విన్నకోట శేషాచార్యులు, నల్లూరి రామకృష్ణ ఏఎంసీ ఛైర్మన్ మార్ని వాసుదేవరావు, మత్యేటి సత్య ప్రసాద్, గంగిన హనుమంతరావు, నున్నకృష్ణ, కురుకూరి కిషోర్, బొప్పన సుబ్బారావు, మార్ని దొరబ్బాయి, గంగిన నాని, రాజమహేం ద్రవరం వ్యవసాయ సహాయ సంచాలకులు సూర్యరమేష్, తహసీల్దార్ శ్రీనివాసరావు, ఎంపీడీవో సునీల్ ఆర్మ్‌స్ట్రాంగ్, ఏఈవోలు వేణుమాధవరావు, పీటర్, సొసైటీ సీఈవో కేవీవీ సత్యనారాయణ, మద్దుకూరి సత్యనారాయణ, రైతుల పాల్గొన్నారు.

సేంద్రియ వ్యవసాయాన్ని ప్రోత్సహించడమే లక్ష్యం

అనపర్తి(ఆంధ్రజ్యోతి): రైతులను సేంద్రియ వ్యవసాయంవైపుకు మళ్లించడమే ధ్యేయంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేస్తున్నాయని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. బుధవారం బిక్కవోలు మండలం పందలపాక గ్రామంలో సర్పంచ్ పద్మావతి అధ్యక్షతన జరిగిన అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ నిధుల పంపిణీ కార్యక్రమం అనపర్తి నియోజకవర్గ పరిధిలో నిర్వహించారు. ఈ సందర్భంగా నియోజకవర్గపరిధిలోని 24,591మంది రైతులకు రూ.16.59కోట్ల నిధులకు సంబంధించిన నమూనా చెక్‌ను ఎమ్మెల్యే రైతులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం ప్రతీ రైతుకు ఏడాదికి రూ.20వేలు అందిస్తామని ఇచ్చిన హామీ ప్రకారం రెండో విడత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మరో 7వేలు జమచేసిందన్నారు. ప్రస్తుత పరిస్థితులలో పురుగు మందులు వాడకం అధికం కావడంతో ప్రజలు అనేకరోగాల భారిన పడుతున్నారని దీని నుంచి బయటపడేందుకు ప్రతిఒక్కరూ సేంద్రియ వ్యవసాయం వైపు మారాలని అన్నారు. వ్యవసాయం లాభసాటి కావాలన్న లక్ష్యంతో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పథకాల ద్వారాను, ఎరువుల సబ్సిడీ ద్వారాను ఏడాదికి రూ.38వేల వరకు మేలు జరుగుతుందన్నారు. ఆర్డీవో కృష్ణనాయక్ మాట్లాడుతూ పురుగు మం దులు అధికంగా వాడటం ద్వారా కేన్సర్ వ్యాధి ప్రబలుతుందని రైతులు ఈ విషయాలపై అవగాహన చేసుకుని ప్రకృతి వ్యవసాయంవైపు మొగ్గు చూపితే అటు రైతుతో బాటుగా ఇటు ప్రజల ఆరోగ్యం మెరుగుపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి నల్లమిల్లి మనోజ్‌రెడ్డి, ఏఎంసీ చైర్‌పర్సన్ జుత్తుక సూర్యకుమారి, ఆత్మ కమిటీ చైర్మన్ వెలుగుబంటి సత్తిబాబు,జనసేన నాయకుడు రావాడ నాగు, కూటమి నాయకులు ఆళ్ళ గోవిందు, జుత్తుక కృష్ణ, పడాల వెంకటరామారెడ్డి(చిన బుజ్జి), పడాల వెంకటరామారెడ్డి, త్రిమూర్తులు, దత్తుడు శ్రీను, కర్రి శేషారత్నం, కర్రి సత్యగౌరి, బేరా వేణమ్మ, నియోజకవర్గ ప్రత్యేకాధికారి ప్రేమ్‌కుమార్, బిక్కవోలు మండల ప్రత్యేకాధికారిణి శ్రీదేవి, సర్పంచ్‌లు గొల్లు హేమతులసి, నియోజకవర్గ పరిధిలోని డీసీ చైరన్లు, సొసైటీల అధ్యక్షులు, కూటమి నాయకులు, వ్యవసాయశాఖ ఏడీఏ కృష్ణ, రైతులు పాల్గొన్నారు.

రైతు రాజ్యమే కూటమి ప్రభుత్వ లక్ష్యం

కోరుకొండ (ఆంధ్రజ్యోతి): రాజానగరం నియోజకవర్గంలో పీఎం కిసాన్, అన్నదాత సుఖీభవ ద్వారా సుమారు 48వేల మంది రైతులకు రూ.17,58,53,000కోట్ల నిధులను కోరుకొండ ఎంపీడీవో కార్యాలయంలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే బత్తుల బల రామకృష్ణ నమూనా చెక్కును విడుదలచేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వం అన్నదాత సుఖీభవ పీఎం కిసాన్ ద్వారా రైతు కుటుంబాలకు సాగు ఖర్చులను భరించడానికి ప్రతి రైతు కుటుం బానికి రూ.20వేలు ఆర్థిక సహాయం అందించారు. ఈ రూ.20వేలులో రైతు కుటుంబాలకు, రూ.6వేలు, కేంద్ర ప్రభుత్వ పీ.ఎం.కిసాన్ కార్యక్రమం నుంచి మిగిలిన రూ.14వేలు రాష్ట్ర ప్రభుత్వం అన్నదాత సుఖీభవ కార్యక్రమం నుంచి ఇస్తుందన్నారు. రైతులతో కలిసి రైతు కష్టాలను తెలుసుకుంటూ ఎన్డీయే ప్రభుత్వం రైతులకు చేస్తున్న అభి వృద్ధి కార్యక్రమాలు వివరించారు. అనంతరం వారితో కలిసి భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో వీరితోపాటు రుడా ఛైర్మన్ బొడ్డు వెంకటరమణ చౌదరి, ఏఎంసీ ఛైర్మన్, ఏఎంసీ వైస్ ఛైర్మన్, సొసైటీ ఛైర్మన్ డైరెక్టర్లు ప్రభుత్వ అధికారులు, వ్యవసాయ అధికారులు, రైతులు ఎన్డీఏ కూటమి నాయకులు అధికారులు పాల్గొన్నారు.





పందలపాకలో అన్నదాత సుఖీభవ నమూనా చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి, కోరుకొండలో పీఎం కిసాన్ చెక్కును విడుదల చేస్తున్న ఎమ్మెల్యే బత్తుల, రుడా చైర్మన్ బొడ్డు



సచివాలయాన్ని తనిఖీ చేస్తున్న ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు

ఉద్యోగులు ప్రజలకు అందుబాటులో ఉండాలి

● 33, 57 సచివాలయాల తనిఖీలో ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు

రాజమహేంద్రవరంసిటీ, నవంబరు19(ఆంధ్రజ్యోతి): నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ విధులు సక్రమంగా నిర్వర్తించాలని రాజమహేంద్రవరం ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు సూచించారు. రాజమహేంద్రవరం బైపాస్ రోడ్డులోని డీఎంహెచ్ స్కూల్ పక్కనేఉన్న 33వ నెంబరు సచివాలయం, 31వ డివిజన్‌లో ఉన్న 57వ నెంబరు సచివాలయాలను బుధవారం ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు తనిఖీ చేశారు. ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదుల నేపథ్యంలో ఎమ్మెల్యే ఆకస్మికంగా తనిఖీలు చేశారు. ఈసం దర్భంగా ఆదిరెడ్డి వాసు ఆయా సచివాయాలలో ఎంత మంది పనిచేస్తున్నారు? ఏఏవిధులను ఎవరెవరు నిర్వహిస్తున్నారు. ప్రజల నుంచి వచ్చిన సమస్యలపట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నవారి పరిస్థితిని ఆరాతీశారు. ప్రజలకు అందుబాటులో ఉండి సేవలు అందించాలని సూచించారు. కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

దోమల నివారణకు చర్యలు చేపట్టరా!

● సర్వసభ్య సమావేశంలో ఎంపీటీసీ సభ్యుల ఆగ్రహం



సమావేశంలో అధికారులను నిలదీస్తున్న ఎంపీటీసీ సభ్యురాలు సత్యవతి

గోకవరం, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): గ్రామాలలో దోమల నివారణకు అధికారులు ఎటువంటి చర్యలు తీసుకోవడంలేదని, దీనివల్ల ప్రజలు రోగాలబారిన పడడంతోపాటు, రాత్రివేళ కంటిమీద కునుకు ఉండడంలేదని పలువురు ఎంపీటీసీ సభ్యులు అధికారుల తీరుపై ధ్వజమెత్తారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఎంపీపీ సుంకర శ్రీవల్లి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా పలు గ్రామాలలో నెలకొన్న సమస్యలను ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు సమావేశం దృష్టికి తీసికొచ్చారు. వైద్యశాఖ, పంచాయతీ అధికారులు దోమల నివారణకు ప్రత్యేకమైన చర్యలు చేపట్టాలని గుమ్మళ్ళ దొడ్డి ఎంపీటీసీ సభ్యురాలు కోట సత్యవతి కోరారు. సుమారు నెలరోజులుగా సత్యసాయి డ్రింకింగ్ వాటర్ సరఫరా కావడం లేదని, వెంటనే తాగునీరు అందేలా చర్యలు తీసుకోవాలని పలువురు సమావేశం దృష్టికి తీసుకొచ్చారు. బాల్యవివాహాలను అరికట్టేందుకు ప్రజాప్రతినిధులు సహకరించాలని, జిల్లాలోనే అత్యధికంగా గోకవరం మండలంలోనే 18ఏళ్లలోపు యువతులకు వివాహాలు జరుగుతున్నట్లు సమాచారం ఉందని ఐసీడీఎస్ సీడీపీవో సంధ్యారాణి అన్నారు. ఈ సమావేసంలో వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, అధికా రులు, తదితరులు పాల్గొన్నారు.

మెగా జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోండి

● ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి

అనపర్తి, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): ఈనెల 23వ తేదీ ఆదివారం అనపర్తిలోని శ్రీరామారెడ్డి జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో వికాస ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం అనపర్తి మండలం రామవరంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ జాబ్‌మేళాలో 33 ప్రముఖ కంపెనీలు హాజరుకానున్నాయని సుమారు 1200కుపైగా ఉద్యోగావకాశాలు కల్పించనున్నారని యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. దరఖాస్తుల కోసం అనపర్తిలోని తమ కార్యాలయంలో సంప్రదించవచ్చని ఆయన పేర్కొన్నారు. ఈ సమావేశంలో కూటమి నాయకులు పడాల వెంకటరామారెడ్డి, తేనెల శ్రీనివాస్, చింతా సురేష్‌రెడ్డి, కర్రి వెంకటరెడ్డి, నల్లమిల్లి శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జీవనాధార పర్యావరణంపై సదస్సు

రాజమహేంద్రవరంఅర్బన్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల రసాయనశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో ఈనెల 21, 22 తేదీల్లో జీవనాధార పర్యావరణం కోసం ప్రతిఘటనాత్మక ఆవిష్కరణలు అనే అంశంపై రెండు రోజుల సదస్సు నిర్వహిస్తున్నట్టు కళాశాల ప్రిన్సిపాల్ రామచంద్ర ఆర్కే తెలిపారు. డీఎస్‌టీ, ఎస్ఈఆర్‌బీ, ఏఎన్ఆర్ఎఫ్ మద్దతుతో ఈ సదస్సు జరుగనుందని ఆయన తెలిపారు. ఈ సదస్సులో ఐఏఎస్‌పీ బెంగుళూరు నుంచి శాంతి స్వరూప్ భట్నాగర్ అవార్డు గ్రహీత ప్రొఫెసర్ కేఆర్ ప్రసాద్, దేశంలోని వివిధ విశ్వవిద్యాలయాల పరిశోధనా సంస్థల నుంచి శాస్త్రవేత్తలు పాల్గొని నైపుణ్యాలను అందిస్తారని కన్వీనర్ శ్రీనివాస్, ఆర్గనైజింగ్ సెక్రటరీలు శ్రీధర్, తేజస్విని తెలిపారు.

యాదవులు ఐక్యతతో అభివృద్ధి సాధించాలి

● యాదవ సంఘం నాయకుడు గోపి



కార్తీక వనసమారాధనలో మాట్లాడుతున్న అంకం గోపీ

కడియం, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): కడియం మండలం బుర్రిలంకలో శ్రీకృష్ణదేవరాయ యాదవ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో బుధవారం కార్తీక వనసమారాధన జరిగింది. ఈ కార్యక్రమం జాతీయ బీసీ సంఘం న్యాయవిభాగం ఉపాధ్యక్షుడు దండుబోయిన వీరవెంకటసత్యనారాయణమూర్తి, మండల సంఘం అధ్యక్షుడు నూనె వెంకటేశ్వరరావు, కార్యవర్గసభ్యులు తానంకి ఏసు, నూనె ప్రభు, కానుబోయిన నాగేశ్వరరావు, దండుమేను ఈశ్వరరావు, మలసాని సుబ్రహ్మణ్యం, తూపాటి దుర్గారావులతోపాటు యాదవ సంక్షేమ సంఘం నాయకులు, యాదవ సంఘ పెద్దలు తదితరులు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో యాదవ సంఘం నాయకులు అంకం గోపీ, నొడగల సుధా, మురుకుర్తి నరేష్ కుమార్, మురుకుర్తి రవి, పడాల నాగరాజు, జానా కేశవ, శంకర్, నక్కెళ్ళ బాబూరావు, రాజనాల సత్యనారాయణ,తుల్లి పద్మావతి, టి.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు యాదవ సంఘం నాయకులు మాట్లాడుతూ యాదవజాతి చారిత్రకమైనది అన్నారు. ఐకమత్యంతో మెలగుతూ విద్యా, వ్యాపార, రాజకీయ పరంగా అన్నిరంగాల్లో ఉన్న తస్థాయికి చేరుకోవాలన్నారు. కులమతాలకు అతీతంగా వనసమారాధనలో పాల్గొన్న కూటమి, వైసీపీ నాయకులతోపాటు నర్సరీ రైతులను సంక్షేమ సంఘం ఘనంగా సత్కరించింది.

‘ఇందిరా గాంధీ సేవలు ఎనలేనివి’



జాంపేట వద్ద ఇందిరాగాంధీ విగ్రహానికి పూలమాలలు వేస్తున్న నాయకులు

రాజమహేంద్రవరంకల్చరల్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): భారతరత్న, మాజీ ప్రధాని ఇందిరాగాంధీ దేశానికి అందించిన సేవలు చిరస్మరణీయమని కాంగ్రెస్ పార్టీ నాయకులు కొనియాడారు. ఇందిరాగాంధీ జయంతి సందర్భంగా స్థానిక జాంపేట వంతెన వద్దనున్న ఆమె విగ్రహానికి నగర కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షుడు టీకే విశ్వేశ్వరరెడ్డి, పీసీసీ ఉపాధ్యక్షుడు మార్టిన్ లూథర్, పీసీసీ ప్రధాన కార్యదర్శి అరిగెల అరుణకుమారి, జిల్లా కాంగ్రెస్ అధికార ప్రతినిధి అడుసుమిల్లి రమేష్ చౌదరి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బాలేపల్లి మాట్లాడుతూ ఇందిరాగాంధీ జీవితాన్ని దేశసేవకే అంకితం చేశారన్నారు. టీకే విశ్వేశ్వరరెడ్డి మాట్లాడుతూ ఇందిరాగాంధీ దేశ ప్రధానిగా తీసుకున్న ఎన్నోనిర్ణయాలు విప్లవాత్మక సంస్కరణలు దేశాన్ని ప్రగతి పథంలో నడిపించాయన్నారు.

జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు

బుధవారం గౌతమీగ్రంథాలయంలో ముందుగా గ్రంథాలయ ప్రాంగణంలోగల సరస్వతీదేవి విగ్రహానికి పూలమాలలువేసి అనంతరం ఇందిరాగాంధీ జయంతి సందర్భంగా ఇందిరాగాంధీ చిత్రపటానికి జ్యోతి ప్రజ్వలనచేసి పూలమాలలువేసి నివాళులర్పించారు. ఈకార్యక్రమంలో ప్రముఖ హైకోర్టు లాయర్ జీవీఎస్ లక్ష్మీతులసి, డాక్టర్ హేమనళిని, గ్రంథాలయాధికారి డివెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మహిళా దినోత్సవం

బిక్కవోలు, నవంబరు19(ఆంధ్రజ్యోతి): గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా కొంకుదురు శాఖా గ్రంథాలయంలో బుధవారం ఘనంగా మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా దేశ మొట్టమొదటి ప్రధాని ఇందిరాగాంధీ జయంతి సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఆమె దేశానికి చేసిన సేవలుగురించి కొంకుదురు ఉన్నత పాఠశాల హెచ్‌ఎం ఎం.శ్రీనివాస్ వివరించారు. అనంతరం విద్యార్థులకు చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి ఎస్.బాల, ఉపాధ్యాయులు కృష్ణ, శిరీష, తదితరులు పాల్గొన్నారు.

నేషనల్ ఇండిపెండెంట్ చర్చి ఏపీ ఛైర్మన్‌గా డాక్టర్ బిషప్ థామస్



సమావేశంలో నియామక పత్రాన్ని చూపిస్తున్న బిషప్ థామస్

రాజమహేంద్రవరం సిటీ, నవంబరు19(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం కేంద్రంగా గత 36 ఏళ్లుగా క్రీస్తు బోధనలుచేస్తూ లక్షలాది మందికి సహాయం చేస్తున్న దహించు అగ్ని సంస్థ వ్యవస్థాపకుడు డాక్టర్ బిషప్ థామస్ నేషనల్ ఇండిపెండెంట్ చర్చి ఏపీ ఛైర్మన్‌గా నియమితులయ్యారు. ఈసందర్భంగా రాజమహేంద్రవరం దహించు అగ్ని ప్రార్థన మందిరంలో బుధవారం సాయంత్రం జరిగిన విలేకరుల సమావేశంలో థామస్ మాట్లాడారు. 17 రకాల పరిచర్యలు నిర్వహిస్తున్నానని 70 మంది అనాథపిల్లలను చేరదీసి చదివిస్తున్నానని ప్రతిరోజు 200మంది బిక్షకులకు ఆహారం అందిస్తున్నానని తన సేవా కార్యక్రమాలను గుర్తించి నేషనల్ ఇండిపెండెంట్ చర్చి వారు తనను ఏపీ స్టేట్ ఛైర్మన్‌గా నియమిస్తూ ఉత్తర్వులు ఇచ్చారని తెలిపారు. అనంతరం బిషప్ థామస్‌ను పలువురు ఘనంగా సత్కరించారు. షీబా థామస్, కేధరి జాయితి, చరిష్మా, దానియేలు, రవి తదితరులు పాల్గొన్నారు.

హిందూ ధర్మ పరిరక్షణకు కృషి చేస్తా

● అన్న సమారాధనలో పాల్గొన్న కంబాల



కోరుకొండలో మాట్లాడుతున్న కంబాల శ్రీనివాసరావు

కోరుకొండ, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): హిందూధర్మ పరిరక్షణకు నిరంతరం కృషిచేస్తానని, విశ్వహిందూ ధర్మపరి రక్షణ రామసేన అధ్యక్షుడు కంబాల శ్రీనివాసరావు అన్నారు. కోరుకొండ మండలం కాపవరం గ్రామం అన్నపూర్ణ విశ్వేశ్వరస్వామి, శివాలయంవద్ద బుధవారం నిర్వ హించిన అన్న సమారాధన కార్యక్రమంలో కంబాల శ్రీనివాసరావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆలయంలో స్వామివారిని దర్శించుకొని, ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు ఘనంగా సత్కరించారు. ఈ అన్నసమారాధన కార్యక్రమానికి కంబాల శ్రీనివాసరావు లక్ష రూపాయలు విరాళం అందజేశారు. కార్యక్రమంలో కాపవరం సర్పంచ్ జాజుల రాము, ఎంపీటీసీ సభ్యుడు కలచర్ల నాగు, చిన్నారావు, వెంకటేశ్వర్లు, పెద్దకాపు, కటకం చలం, దుర్గాచారి, సలాది వెంకటేశ్వరరావు, జాజుల తాతారావు, ఐళ్ల దుర్గారావు, శీలం దుర్గారావు, హరిబాబు, బాను, రామసేన సభ్యులు, బీజేపీ నాయకులు బత్తుల నానాజీ, పెద్దాడ వెంకన్న దొర, నాగ రమేష్, బత్తిన వీరాంజనేయులు, చింతల కన్నారావు, పలకం శెట్టి శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

మైనింగ్ విద్యార్థులకు ఉద్యోగావకాశాలు మెండు

● జీజీయూలో జీఐఎస్ దినోత్సవం



సమావేశంలో వివరిస్తున్న వినోద్‌కుమార్

రాజానగరం, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): జీఐఎస్‌లో సివిల్ మైనింగ్ విభాగాల్లో ఇంజనీరింగ్ అభ్యసించిన విద్యార్థులకు అపారమైన ఉద్యోగావకాశాలు ఉన్నాయని మైనింగ్ విభాగం అధిపతి వై.వినోద్‌కుమార్ పేర్కొన్నారు. గోదావరి గ్లోబల్ విశ్వవిద్యాలయంలోని సివిల్ ఇంజనీరింగ్ మైని ంగ్ ఇంజనీరింగ్ విభాగాల సంయుక్త ఆధ్వర్యంలో జీఐఎస్ దినోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా సివిల్ ఇంజనీరింగ్‌లో రిమోట్ సెన్సింగ్, జీఐఎస్ పాత్ర అనే అంశంపై వై.వినోద్‌కుమార్ మాట్లాడుతూ ప్రస్తుతం సివిల్ మైనింగ్ ఇంజనీరింగ్‌లలో రిమోట్ సెన్సి ంగ్ (జీఐఎస్)ప్రాధాన్యం ఎంతో ప్రాధాన్యం పెరిగిందన్నారు. ఖనిజాలు అన్వేషణ మ్యాపింగ్ వంటి వాటికి జీఐఎస్‌ను ఉపయోగిస్తున్నారన్నారు. ఈకార్యక్రమంలో సివిల్ ఇంజనీరింగ్ విభాగాధిపతి పి.వి. కోటేశ్వరరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

26 నుంచి సుబ్రహ్మణ్య షష్ఠి ఉత్సవాలు

దివాన్‌చెరువు, నవంబరు19 (ఆంధ్రజ్యోతి): రాజానగరం మండలం శ్రీకృష్ణపట్నంలో ఉన్న శ్రీవల్లీదేవసేనా సమేత సుబ్రహ్మణ్యస్వామి షష్ఠి మహోత్సవాలు ఈనెల 26వతేదీ నుంచి ప్రారంభం అవుతాయని ఉత్సవకమిటీ తెలిపింది. దీనికి సంబంధించి వారు బుధవారం విలేకరులకు వివరాలు తెలిపారు. ఈనెల 26 నుంచి 30వ తేదీ వరకూ ఐదురోజుల పాటు ఈఉత్సవాలు జరుగుతాయన్నారు. తొలిరోజు 26వతేదీ వేకువజామున మూడు గంటలకు స్వామివారి కల్యాణోత్సవం జరుగుతుందని తెలిపారు. సాయంత్రం మూడు గంటల నుంచి స్వామివారి పల్లకీ ఊరేగింపుతోపాటు బాణసంచా కాల్పులు, సాంస్కృతిక కార్యక్రమాలు జరుగుతాయన్నారు. అలాగే ఆఖరిరోజైన ఈనెల 30వతేదీన స్వామి అమ్మవార్ల ఊరేగింపు జరుగుతుందని తెలిపారు. భక్తులు ఈ ఉత్సవాలకు అధికసంఖ్యలో హాజరై స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించాలని కమిటీ వారు కోరారు.

రెండోరోజుకు పోలవరం నిర్వాసితుల నిరసన దీక్ష



దీక్షా శిబిరం వద్ద నిర్వాసితులతో మాట్లాడుతున్న తహశీల్దారు రామకృష్ణ

గోకవరం, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): తమ డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ గోకవరం గ్రామశివారున గల గంగాలమ్మతల్లి గుడి వద్ద చేపట్టిన నిరసన దీక్ష బుధవారం నాటికి రెండోరోజుకు చేరుకొంది. దీక్షా శిబిరాన్ని తహశీల్దారు రామకృష్ణ సందర్శించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వర్షాకాలంలో కాలనీలోకి నీరుచేరి గోదావరిని తలిపిస్తోందని, కోర్టులో ఉన్న 9ఎకరాల భూమి సమస్యను వెంటనే పరిష్క రించాలని విజ్ఞప్తి చేశారు.

‘దంత సంరక్షణలో ప్రత్యేకశ్రద్ధ వహించాలి’



దంత పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

రాజానగరం, నవంబరు19 (ఆంధ్రజ్యోతి): 66వ జాతీయ ఫార్మసీ వారోత్సవాలను పురస్కరించుకుని ఇండియన్ ఫార్మాస్యూటికల్ సంఘం, స్కూల్ ఆఫ్ ఫార్మసీ, గోదావరి గ్లోబల్ యూనివర్శిటీలో ఫార్మసీ వారోత్సవాల్లో భాగంగా బుధవారం ఉచిత ఆరోగ్య శిబిరం నిర్వహించారు. ఈసందర్భంగా తనూజ దంత వైద్యురాలు శ్రీ వాణి మాట్లాడుతూ దంత సంరక్షణలో ప్రతి ఒక్కరూ ప్రత్యేకశ్రద్ధ వహించాలన్నారు. దీనిలో భాగంగా 50మందికి కంటి పరీక్షలు, నీరజ ఆసుపత్రి వైద్యులు రక్తపోటు, మధుమేహం పరీక్షలు నిర్వహించారు. డీన్ ఎం.డి.ధనరాజు, ఏఆర్ మగేష్, డి.కవిత, షేక్ మీరా పాల్గొన్నారు.

స్వదేశీ వస్తువులనే ప్రతిఒక్కరూ వాడాలి



సమావేశంలో మాట్లాడుతున్న నాగేంద్ర

దేవరపల్లి, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): స్వదేశీ వస్తువులనే ప్రతి ఒక్కరూ వాడాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు పిక్కి నాగేంద్ర పేర్కొన్నారు. బుధవారం యర్నగూడెంలో బీజేపీ ఆధ్వర్యంలో స్వదేశీ వస్తువులు వాడాలనే నినాదంతో ఆత్మ నిర్భర భారత్ కార్యక్రమంలో భాగంగా పార్టీ కార్యకర్తలకు, నాయకులకు సంకల్ప అభియాన్ నిర్వహించారు. ఈ సందర్భంగా నాగేంద్ర మాట్లాడుతూ మన దేశంలో తయారు చేసిన వస్తువులనే వాడాలని, విదేశీ వస్తువులు తిరస్కరించాలని, ప్రతిఒక్కరూ స్వదేశీ వస్తువులు కొనేవిధంగా అవగాహన కల్పించాలని పిలుపునిచ్చారు. బీజేపీ ఓబీసీ మోర్చ అధ్యక్షుడు ఆర్.శ్రీనివాస్, జాతీయ కార్యవర్గ సభ్యుడు సత్తిబాబు, ఆత్మనిర్భర భారత్ జిల్లా కన్వీ నర్ వేపకాయల కాశీ, ఎస్సీ మోర్చ జిల్లా అధ్యక్షుడు దున్నా సుమన్ బాబు, బీజేపీ నాయకులు ముప్పిడి భాస్కరరావు, వెంకటపతిరాజు పాల్గొన్నారు.

అసంఘటిత రంగ కార్మికులు ఈ-శ్రమ్‌లో నమోదు చేసుకోవాలి

● డీఎల్ఎస్ఏ కార్యదర్శి శ్రీలక్ష్మీ

రాజమహేంద్రవరం, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): అసంఘటిత రంగ కార్మికులు ఈ-శ్రమ్ కార్డును పొందాలని డీఎల్ఎస్ఏ కార్యదర్శి ఎన్.శ్రీలక్ష్మి సూచించారు. స్పిన్నింగ్ మిల్స్, ఎస్ఆర్‌కేఆర్‌లో అసంఘటిత రంగ కార్మికులకు బుధవారం న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నల్సా అసంఘటిత రంగ కార్మికులకు న్యాయసేవల పథకం-2015 గురించి వివరించారు. న్యాయపరమైన అవసరాలకు డీఎల్ఎస్ఏని సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో ఏసీఎల్ బీఎస్ఎం వలీ, డీఎంహెచ్‌వో డాక్టర్ భావన పాల్గొన్నారు.



రంపచోడవరంలో అటెన్షన్..

రంపచోడవరం ఏరియా ఆసుపత్రి వద్ద టెన్షన్ నెలకొంది. మంగళవారం ఉదయం ఎన్‌కౌంటర్‌లో మృతిచెందిన హిడ్మా సహా ఆరుగురు మావోయిస్టుల మృతదేహాలను అక్కడే భద్ర పరిచారు.బుధవారం కుటుంబీకులు, బంధువులు రావడంతో పోస్టుమార్టం ప్రక్రియ ప్రారంభించారు. హిడ్మా,ఆయన భార్య రాజే మృతదేహాలకు హిడ్మా సోదరుడు ముయా, రాజే సోదరుడు హెలిన్ సమక్షంలో పోస్టుమార్టం పూర్తిచేశారు. మంగళ, బుధవారం ఎన్‌కౌంటర్లలో మరణించిన మిగిలిన వారికి గురువారం పోస్టుమార్టం చేస్తారు.



అడవిలో.. అలజడి

(రంపచోడవరం/మారేడుమిల్లి)

అడవిలో అలజడి రేగింది. గత రెండు రోజులుగా ప్రశాంతంగా ఉండే మారేడుమిల్లి ఫారెస్ట్ లో తూటాల శబ్దాలు.. కేంద్ర, రాష్ట్ర భద్రతా దళాల బూట్ల హడావుడితో తెలియని భయం నెలకొంది. ఇక్కడ వరుసగా జరిగిన రెండు ఎన్‌కౌంటర్లతో రేపు ఏం జరుగుతుందోననే ఆందోళన కలిగిస్తున్నాయి. మావోయిస్టు అగ్రనేత హిడ్మా, ఆయన భార్య రాజే సహా మొత్తం ఆరుగురు మంగళవారం నాటి ఎన్‌కౌంటర్లో హతమైన సంగతి తెలిసిందే. దేశవ్యాప్తంగా సంచలనం కలిగించిన ఈ ఘటన జరిగి 24 గంటలు దాటక ముందే బుధవారం వేకువజామున జరిగిన మరో ఎన్‌కౌంటర్ హడలెత్తించింది. మొదటి ఎన్‌కౌంటర్ మారేడుమిల్లి మండలంలోని నెల్లూరులో జరగ్గా.. ఆరుగురు మృతి చెందారు.. ఇదే మండలంలోని జీఎం వలస గ్రామంలో రెండో ఎన్‌కౌంటర్ జరగ్గా ఏడుగురు మృతి చెందారు. గత రెండు రోజులుగా వందలాది భద్రతా దళాల రాకపోకలతో రంపచోడవరం-మారేడుమిల్లి ఏజెన్సీ హడావుడిగా మారింది. మృతదేహాలు భద్రపరిచిన రంపచోడవరం ఏరియా ఆసుపత్రి వద్ద భద్రతా దళాలు పహారాగా ఉన్నారు. ప్రతి ఒక్కరి రాకపోకలను నిరంతరం వీరు పర్యవేక్షిస్తున్నారు.ఏరియా ఆసుపత్రికి వచ్చిన మృతుల బంధువులు విడిగా కూర్చొని ఉండేలా జాగ్రత్తలు తీసుకున్నారు.ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ప్రతి విషయంలోనూ గోప్యత పాటిస్తున్నట్టుగా ఇక్కడి పరిస్థితి నెలకొంది.

మారేడుమిల్లికే ఎందుకు?

రంపచోడవరం ఏజెన్సీలో దాదాపు రెండు దశాబ్దాల నుంచి నక్సల్స్ జాడలు తగ్గిపోయాయి. ఈ ఏడాది ఏడు నెలల్లో నాలుగు ఎన్‌కౌంటర్లు జరగడంతో పాటు బుధవారం నాటికి 18 మంది మావోయిస్టులు హతమయ్యారు. ఈ ఏడాది వై.రామవరం మండలం అటవీ ప్రాంతంలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో ఇద్దరు, జూన్‌లో మారేడుమిల్లి మండలం కింటుకూరు అడవుల్లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో ముగ్గురు మావోయిస్టులు మృతిచెందారు. మంగళవారం నాటి ఎన్‌కౌంటర్‌లో ఆరుగురు,బుధవారం నాటి ఎన్‌కౌంటర్‌లో ఏడుగురు మృతి చెందారు. ఛత్తీస్‌గఢ్ నుంచి సురక్షిత ప్రాంతమైన మారేడుమిల్లి ఏజెన్సీకి మావోయిస్టు లు తరలివస్తున్నారని స్వయంగా జిల్లా ఎస్పీ బర్దర్ వెల్లడించడంతో మళ్లీ మావోయిస్టుల ప్రభావంపై చర్చ జరుగుతోంది.మారేడుమిల్లి ఏజెన్సీలోకిమావోయిస్టులు..ముఖ్యనేతలు వస్తున్నారంటే ఇప్పటికే ఇక్కడ అనువైన వాతావరణం ఏర్పాటుచేసుకుని ఉండొచ్చనే వాదన వినిపిస్తోంది.దీంతో నిఘా వర్గాలు రంగంలోకి దిగాయి. కూంబింగ్ నిరంతరం సాగేలా భద్రతా దళాలకు ఆదేశాలు అందుతున్నాయి.

గిరిజనుల్లో భయం భయం

అల్లూరి జిల్లా మారేడుమిల్లి అటవీ ప్రాంతంలో జరిగిన ఎన్‌కౌంటర్ల జరిగిన సమీప గ్రామాల్లో 'ఆంధ్రజ్యోతి' బృందం బుధవారం పర్యటించింది. అయితే ఇక్కడ సాధారణ వాతావరణమే నెలకొంది. చాలా మందికి ఎన్‌కౌంటర్ తమకు సమీపంలోనే జరిగిందనే సమాచారం కూడా తెలీదు. మారేడుమిల్లి మండల కేంద్రంలోనే అలాంటి వాతావరణం కనిపించలేదు. కానీ మంగళవారం ఎన్‌కౌంటర్ జరిగిన నెల్లూర్ సమీప నివాసిత ప్రాంతంలోనూ, బుధవారం ఎన్‌కౌంటర్ జరిగిన గుజ్జుమామిడి వలస (జీఎం వలస) పంచాయతీలోనూ ఇదే విషయం చర్చించుకుంటున్నారు. కొండపోడు వ్యవసాయం, కల్లు చెట్టు గీతకు ప్రతిరోజూ వేకువజామునే ఆయా అటవీ మార్గాల్లో సంచరించే గిరిజనులు ఈ ఘటనతో తీవ్ర భయభ్రాంతులకు గురయ్యారు.

- రెండో రోజూ పేలిన తూటాలు
- టెక్ శంకర్ సహా ఏడుగురు మృతి
- ఆపరేషన్ సంభవ్ సక్సెస్
- కొనసాగుతున్న కూంబింగ్
- రంపచోడవరం ఆసుపత్రికి సీన్
- భారీగా భద్రత బలగాల పహారా

సెంట్రల్ జైలుకు 40 మంది

రాజమహేంద్రవరం/కాకినాడ/రావులపాలెం,నవంబరు 19 (ఆంధ్ర జ్యోతి): పోలీసులు మంగళ, బుధవారాల్లో రాష్ట్రంలోని విజయవాడ,ఏలూరు, సామర్లకోట, రావులపాలెంలలో అదుపు లోకి తీసుకున్న మావోయిస్టులను రాజమహేంద్రవరంలోని కేం ద్ర కారాగారం, ప్రత్యేక మహిళా కారాగారాలకు కోర్టు ఆదేశాలతో రిమాండ్‌కు తరలించారు. ఏలూరులో పట్టుబడిన 10 మంది, విజయవాడలో నలుగురు, రావులపాలెంలో అరెస్టు చేసిన ఒకరిని కలిపి 15మందిని రాజమహేంద్రవరం సెంట్రల్ జైలుకు తరలించాలని ఆయా కోర్టులు బుధవారం ఆదేశించా యి. విజయవాడ, ఏలూరు, కాకినాడలో అరెస్టు చేసిన 29 మంది మహిళలను ప్రత్యేక మహిళా కారాగారానికి తర లిం చాలని ఆదేశించాయి. ఇప్పుడు రిమాండుకు ఇచ్చిన 40 మం దిపై ఉపా చట్ట ప్రకారం కూడా కేసులు నమోదు చేశారు. దీంతో వీళ్లను మిగతా ఖైదీలతో కలవకుండా ఉంచాల్సి ఉంటుంది. ఇప్పటికే జైలు 1300 మందితో కిక్కిరిసి ఉండడం, గదుల కొరత ఉండడంతో వీళ్లను ఎక్కడ ఉంచుతారో అనే సందిగ్ధం నెలకొంది.



సామర్లకోట నుంచి ఇద్దరు

కాకినాడ జిల్లా సామర్లకోట మండలం కొప్పవరంలో పట్టుబడిన ఇద్దరు మహిళా మావోయిస్టులను పోలీసులు బుధవారం సామర్లకోట సీఐ కృష్ణభగవాన్ నేతృత్వంలో మహిళా ఎస్ఐ, మరికొంత మంది ఎస్కార్ట్ సిబ్బంది మేజిస్ట్రేట్ కోర్టులో హాజరుపరిచారు. కోర్టులో కేసు పత్రాల సమర్పించిన అనంతరం జడ్జి షేక్ షరీన్ 14 రోజులు రిమాండ్ విధించారు. దీంతో వారిని రాజమహేంద్రవరం సెంట్రల్ జైలుకు తరలించారు. పట్టుబడిన ఇద్దరు మహిళా మావోయిస్టుల పేర్లు అనూష, అంకితగా చెబుతున్నారు. మహిళా మావోయిస్టుల్లో ఒకరు మాత్రమే న్యాయమూర్తి మాటలకు సమాధానమిచ్చారు.



రావులపాలెంలో హిడ్మా అనుచరుడు

రావులపాలెం,నవంబరు 19(ఆంధ్రజ్యోతి): కోనసీమ జిల్లా రావులపాలెంలో మావోయిస్టు హిడ్మా అనుచరుడు సరోజ్ మడివి అలియాస్ ఓండాను పోలీసులు అరెస్టు చేసినట్టు రావులపాలెం సీఐ ఎం.శేఖర్‌బాబు తెలిపారు. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని సుక్మా జిల్లా కృష్ణరాం పోలీస్‌స్టేషన్ పరిధిలోని గుర్గేలంకకు చెందిన సరోజ్ మడివి 12వ ఏట మావోయిస్టుల కార్యకలాపాలకు ఆకర్షితుడయ్యాడు. నిఘా వర్గాల సమాచారంతో మంగళవారం రాత్రి రావులపాలెం గౌతమి వంతెన సమీపంలోని డంపింగ్‌యార్డు వద్ద పోలీసులు అరెస్టు చేశారు. తుపాకీతో పాటు పది తూ టాలు స్వాధీనం చేసుకున్నామని తెలిపారు.

2 ఎన్‌కౌంటర్లు..13 మంది హతం : ఎస్పీ

ఆపరేషన్ సంభవ్ పేరిట ఈ కూంబింగ్ జరిగింది. మొదటి రోజు తప్పించుకున్న మావోయిస్టుల కోసం గాలిస్తుండగా బుధవారం తెల్లవారుజామున భద్రతా దళాలకు ఎదురుపడడం, వెంటనే జరిగిన ఎదురుకాల్పుల్లో టెక్ శంకర్ సహా ఏడుగురు మావోయిస్టులు హతమయ్యారు. ఈ రెండు ఎన్‌కౌంటర్లకు సంబంధించి మొత్తం 13 మంది మావోలు మరణించారు.



తెల్లవారుజామున శబ్దాలు : నారాయణరెడ్డి, జీఎం వలస

తెల్లవారు జామున నాలుగు గంటలకు అటవీ ప్రాంతం నుంచి భారీ శబ్దాలు వినిపించాయి. తొలుత పర్యాటకులెవరో సందడి చేస్తున్నారని భావించాం. వరుస భారీ పేలుళ్ల శబ్దాలతో భయపడ్డాం. కొద్దిసేపటికి పోలీసులు వచ్చి ఎవరు అటవీ ప్రాంతం వైపుగానీ, చేను పాకల వైపు రావొద్దని హెచ్చరించడంతో భయాందోళనకు గురయ్యాం.





మహిళలు ఏర్పాటు చేసిన కూరగాయల స్టాల్స్ పరిశీలించి.. అన్నదాత సుఖీభవ నమూనా చెక్ అందజేస్తున్న మంత్రి నిమ్మల, కలెక్టర్ కీర్తి చేకూరి, ఎమ్మెల్యే మద్దిపాటి



టీడీపీలోనే రైతు సంక్షేమం

అన్నదాత సుఖీభవ చెక్కుల పంపిణీలో మంత్రి నిమ్మల రామానాయుడు

దేవరపల్లి, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : రైతుల సంక్షేమానికి ఎన్‌డీఏ ప్రభుత్వం ఎంతో కృషి చేస్తుందని జిల్లా ఇన్‌ఛార్జ్ మంత్రి, రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు పేర్కొన్నారు. దేవరపల్లి మండలం గౌరీపట్నంలో బుధవారం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు అధ్యక్షతన నిర్వహించిన అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. గత వైసీపీ ప్రభుత్వం వ్యవసాయరంగాన్ని పూర్తిగా నిర్వీర్యం చేసిందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సూపర్-6 హామీల్లో భాగంగా ప్రతి రైతుకు రూ.20 వేలు ఆర్థిక సాయం అందిస్తున్నారన్నారు. రెండో విడతలో భాగంగా కేంద్ర ప్రభుత్వం రూ.2 వేలు, రాష్ట్ర ప్రభుత్వం రూ.5 వేలు చొప్పున రైతుల ఖాతా ల్లో జమ చేయడం జరిగిందన్నారు. రైతు సంక్షేమం టీడీపీతోనే సాధ్యమన్నారు.ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు మాట్లాడుతూ గోపాలపురం నియోజకవర్గం 65 శాతం వ్యవసాయ రంగంపై ఆధారపడి ఉందన్నారు. నియోజకవర్గంలో 33 వేల కుటుంబాలకు రూ.7 వేలు చొప్పున అన్నదాత సుఖీభవ నిధులు జమయ్యాయని పేర్కొన్నారు.కలెక్టర్ కీర్తి చేకూరి మాట్లాడుతూ రైతులంతా వరికి ప్రత్యామ్నాయంగా పామాయిల్ సాగు చేసుకుంటే ప్రభుత్వం ప్రోత్సాహకాలు అందిస్తుందన్నారు. ఆర్గానిక్ వ్యవసాయ వల్ల ఖర్చు తక్కువ.. లాభం ఎక్కువ ఉంటుందన్నారు. మండల టీడీపీ అధ్యక్షుడు ఆండ్రూ అనీల్ మాట్లాడుతూ కొవ్వాడ కాల్వ కారణంగా గౌరీపట్నం పంటపొలాలు ప్రతీ ఏటా మునిగిపోయేవని ఈ ఏడాది రూ.70 లక్షలతో పూడికతీత పనులు చేపట్టడంతో సమస్య పరిష్కారమైందని మంత్రి రామానాయుడుకు కృతజ్ఞతలు తెలిపారు. గౌరీపట్నం, ధర్మవరం కాల్వ మధ్య బ్రిడ్జి నిర్మించాలని మంత్రిని కోరారు. అనంతరం రైతులు ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి డి.సువర్ణరాజు, ప్రత్యేకాధికారి భాగ్యవతి, డీఆర్‌సీ ఏడీ జయలక్ష్మి, నాయకులు గన్నమని హరికృష్ణ, ముళ్లపూడి దొరాజీచౌదరి, ఉప్పులూరి రామారావు, కొయ్యలమూడి చినబాబు, పెనుమత్స సుబ్బరాజు,జిల్లా వ్యవసాయాధికారులు మాధవరావు,తాతారావు,దేవరపల్లి ఏవో కే.కమలరాజు, తహశీల్దార్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఆసుపత్రి నిర్మాణంపై చర్చకు సిద్ధమా

నిడదవోలు మాజీ ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడికి మంత్రి దుర్గేష్ సవాల్

నిడదవోలు, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : నిడదవోలు ప్రభుత్వాసుపత్రిని వంద పడకల ఆసుపత్రిగా తీర్చిదిద్దే విషయమై ఉమ్మడి వేదికపై చర్చించేందుకు సిద్ధమని రాష్ట్ర మంత్రి కందుల దుర్గేష్ సవాల్ చేశారు. నిడదవోలులో బుధవారం ఆయన విలేకరు లతో మాట్లాడారు. వైసీపీ మాజీ ఎమ్మెల్యే జి.శ్రీనివాస్ నాయుడు అజ్ఞానంతో కేంద్రం నుంచి అనుమతులు తీసుకొచ్చామని గొప్పలు చెప్పుకుంటున్నారన్నారు. నిజంగా అనుమతులు తెస్తే సంబంధిత పత్రాలు చూపించాలని డిమాండ్ చేశారు. ప్రజల అనుమానాలు తీర్చేందుకు ఉమ్మడిగా వేదికపై చర్చిద్దామన్నారు. వంద పడకల ఆసుపత్రి నిర్మాణానికి అనుమతులు తీసుకొస్తే సరికాదని ఫైనాన్స్ శాంక్షన్ కూడా రావాలన్నారు. ఒక రాయి వేసి వంద పడకల ఆసుపత్రిగా మార్చేశామని ప్రజలను మభ్యపెట్టడం సరి కాదన్నారు. ఇటీవల మాజీ ఎమ్మెల్యే జి.శ్రీనివాస్ నాయుడు తాను కొత్తగా ఎమ్మెల్యే అయ్యానంటూ మాట్లాడిన వ్యాఖ్యలను గుర్తు చేస్తూ తాను విద్యార్థి దశ నుంచే రాజకీయాల్లో ఉన్నానన్నారు. 2007 నుంచి 2013 వరకు ఆరేళ్ల పాటు ఎమ్మెల్సీగా పదవీ బాధ్యతలు నిర్వహించి ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టానని తెలిపారు. అప్పటికి శ్రీనివాస్ నాయుడు ఎక్కడున్నారో తెలుసుకోవాలన్నారు. సీఎం చంద్రబాబు కేబినెట్‌లో మంత్రిగా పనిచేస్తున్నానని ఇది తన రాజకీయ పరంపరకు ఉదాహరణ అన్నారు. కొత్తగా వచ్చానని కొత్తగా ఎమ్మెల్యేనయ్యానని లాంటి మాటలు వినియోగించడం శ్రీనివాస్ నాయుడు అవివేకమన్నారు. అజ్ఞానంతో మాట్లాడొద్దని మంత్రి దుర్గేష్ హితవు పలికారు.



విలేకరులతో మాట్లాడుతున్న మంత్రి దుర్గేష్

సత్యదేవా..భక్తజనాదరణ కనవా!

గతేడాది కార్తీకం కంటే తగ్గనున్న సత్యదేవుడి వ్రతాలు

అన్నవరం, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా అన్నవరం సత్యదేవుడి సన్నిధిలో ఏటా కార్తీమాసంలో అధికసంఖ్యలో వ్రతాలు జరుగుతుంటాయి. అయితే ఈసారి మాత్రం ఆ సంఖ్య భారీగా తగ్గనుంది. తెలుగురాష్ట్రాల నుంచే కాకుండా వివిధ ప్రాంతాల నుంచి భక్తులు విచ్చేసి కార్తీకమాసంలో సత్యదేవుడి వ్రతాలు ఆచ రిస్తారు. ఏడాదిలో జరిగే వ్రతాల్లో సుమారు 20 శాతం కార్తీకమాసంలో జరుగుతుండడం విశే షం. గతేడాది కార్తీకమాసంలో 1,45,732 వ్రతా లు జరగగా ఈ ఏడాది 1.50 లక్షలు జరుగుతాయని అధికారులు అంచనా వేశారు. గురువారంతో కార్తీకమాసం ముగియనుండగా బుధవారంతో 133644 వ్రతాలు జరగ్గా గతేడాది కంటే 12088 వ్రతాల లోటులో ఉంది. గురువారం అమావాస్య కారణంగా కేవలం 2వేల వ్రతాలు జరిగే అవకాశాలు ఉన్నాయి. మొత్తం మీద గతేడాది కంటే సుమారు 10 వేల వ్రతాల లోటు కనిపిస్తుంది.దీనికి ప్రధాన కారణం కార్తీకమాసం ప్రారంభంలో మొంథా తుఫాన్ ప్రభావం పడింది. ఈ తుఫాన్ భయంకరంగా ఉంటుందని, కాకినాడ ప్రాం తంలో తీరం దాటుతుందని హెచ్చరికల నేప థ్యంలో భక్తులు వెనకడుగు వేశారు. ఆ సమయంలో భక్తులు పూర్తిస్థాయిలో వచ్చి ఉంటే 1.50 లక్షలు వ్రతాలు జరిగి గతేడాది రికార్డును అధిగమించే అవకాశం ఉండేది. కానీ అలా జరగకుండా వ్రతాల సంఖ్య తగ్గింది.



అన్నవరం సత్యదేవుడి ఆలయంలో వ్రతాలు ఆచరిస్తున్న భక్తులు (ఫైల్)

ఆర్‌వోబీ కాంట్రాక్టర్ వైఖరిపై నిరసన

శివాలయ నిర్మాణానికి అనుమతించం 8

ప్లా - ఎన్‌సీడీ ప్రారంభం

రాజమహేంద్రవరం అర్బన్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో అసంక్రమిత వ్యాధుల నివారణ, నియంత్రణకు పార్టిసిపేటరీ లెర్నింగ్ అండ్ యాక్షన్ (ప్లా - ఎన్‌సీడీ) అనే వినూత్న కార్యక్రమం ప్రారంభించినట్టు డీఎంహెచ్‌వో డాక్టర్ కె.వెంకటేశ్వరరావు తెలిపారు. ఈ మేరకు బుధవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి కార్యాలయం లో ప్లా - ఎన్‌సీడీ ప్రారంభించామన్నారు. దీనిలో భాగంగా రక్తపోటు, మధుమేహం, నోటి కేన్సర్, స్తన కేన్సర్, గర్భాశయ గర్భధార కేన్సర్ వంటి ప్రధాన అసంక్రమిత వ్యాధులపై దృష్టి సారించడం జరుగుతుందని తెలిపారు.జిల్లా ఇమ్యునైజేషన్ అధికారిణి డాక్టర్ శ్రీదేవి పాల్గొన్నారు.

తవుడు కింద గంజాయి

చింతూరు, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): చింతూరు పోలీసులు బుధవారం 120 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఎస్ఐ రమేష్ కథనం మేరకు... ఒడిస్సా రాష్ట్రం మల్కన గిరి జిల్లా ఎంవీ 71 గ్రామానికి చెందిన బిశ్వజిత్ మండల్, సుధీప్ హల్దార్ 120 కిలోల గంజాయిని ఏపీలోకి తరలించే యత్నం చేశారు. బొలేరా వాహనంలో తవుడు లోడు వేసుకుని ఆ లోడు కింద భాగంలో ఎవరికీ అనుమానం కలగకుండా గంజాయి బస్తాలను పేర్చారు. కాగా ఒడిస్సా జంక్షన్‌లో వాహన తనిఖీలు చేస్తున్న క్రమంలో గంజాయిని పోలీసులు పట్టుకున్నారు.



మాట్లాడుతున్న మంత్రి నారాయణ చిత్రంలో ఎమ్మెల్యేలు గోరంట్ల, వాసు, బత్తుల , రుడా చైర్మన్ బీవీఆర్ చౌదరి, కమిషనర్, జేసీ

పుష్కర పనులకు ప్రతిపాదనలు సిద్ధం చేస్తే నిధులిస్తాం

పురపాలక శాఖ మంత్రి నారాయణ

రాజమహేంద్రవరం సిటీ, నవంబరు19(ఆంధ్రజ్యోతి): గోదావరి పుష్కరాలు-2027 పనులకు ప్రతిపాదనలు సిద్ధం చేసి పంపిస్తే నిధులు మంజూరు చేయిస్తామని రాష్ట్ర పుర పాలక శాఖ మంత్రి పి.నారాయణ అన్నారు. రాజమహేంద్రవరం కార్పొరేషన్ కార్యాలయం లో బుధవారం అధికారులు, ప్రజాప్రతినిధుల తో సమీక్షించారు. పుష్కరాలకు వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకోవాలన్నారు.బొమ్మూరు జాతీయ రహదారి నుంచి సరస్వతి ఘాట్ వరకు 80 అడుగుల రోడ్డు నిర్మాణానికి రూ.100 కోట్లు అవసరమవుతాయని చెప్పారు. రాజమహేంద్రవరంలో మొత్తం 862 కిలోమీటర్ల డ్రెయినేజీకి ఇప్పటికి 527 కిలోమీటర్లు నిర్మించారని ఇంకా 303 కిలోమీటర్ల నిర్మాణం జరగాల్సి ఉందన్నారు. వీటిలో తొలిప్రాధాన్యతగా 180 కిలోమీటర్ల మేర డ్రెయినేజీ నిర్మించాలని గుర్తించి రూ. 75 కోట్లు నిధుల అంచనాలు సిద్ధం చేశామన్నారు. టీడీఆర్ బాండ్లు 40 పెండింగ్‌లో ఉన్నాయని ఈ నెలాఖరునాటికి అవి క్లియర్‌చేయాలని అధికారులను ఆదేశించారు. భూసేకరణకు సంబంధించి బాండ్లను 21 రోజుల్లో పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. బీపీఎస్, ఎల్ఆర్ఎస్ స్కీమ్‌లను వినియోగించుకోకపోతే అక్రమ కట్టడాలను కూల్చివేయ డం జరుగుతుందని హెచ్చరించారు. ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు మాట్లాడుతూ నగరంలో రూ. 300 కోట్లతో వివిధ ప్రాంతాల్లో అభివృద్ధి పను లు జరుగుతున్నాయన్నారు. పుష్కరాల అభి వృద్ధి పనులు చరిత్రలో నిలిచేలా ఉంటాయ న్నారు. కాతేరు 4వ బ్రిడ్జి సమీపంలో ఘాట్లను నిర్మించాలని, నగరంలో ఉన్న ఘాట్ల అనుసంధాన ప్రక్రియ జరగాలన్నారు. రాజమహేంద్రవరం, రూరల్, రాజానగరం నియోజకవర్గాల పరిధిలో పుష్కర అభి వృద్ధి పనులు, గోదావరి స్నానాల రేవుల నిర్మాణాలు, డ్రెయినేజీ, రహదారుల నిర్మాణాలపై రుడా ప్లానింగ్ ఆఫీసర్ మూర్తి డిజిటల్ ప్రజంటేషన్ ఇచ్చారు. వాటిలో స్వల్ప మార్పులను మంత్రి నారాయణ, ఎమ్మెల్యేలు గోరంట్ల బుచ్చయ్యచౌదరి, ఆదిరెడ్డి వాసు, బత్తుల బలరామకృష్ణ సూచించారు. కేంద్ర జలశక్తి శాఖ ప్రకటించిన జల్‌సంచాయ్ అవార్డుతో పాటు రూ.2 కోట్లు నగదు బహుమతి, జాతీ య స్థాయిలో నాల్గో ర్యాంక్ రావడంపై మంత్రి అభినందనలు తెలిపారు. రాజమహేంద్రవరంలో మురుగునీటి పారుదలకు సంబంధిం చి డ్రెయినేజీ వాటర్ గోదావరి దిగువన కలిసేవిధంగా చేపట్టిన ప్రాజెక్టు వివరాలను ఇంజనీరింగ్ విభాగం నుంచి ఇన్‌చార్జి ఎస్ఈ రీటా, ఈఈ మదర్సాఆలీలు వివరించారు.ఈ కార్యక్రమంలో జేసీ మేఘా స్వరూప్,కమిషనర్ రాహుల్ మీనా తదితరులు పాల్గొన్నారు.

సమిశ్రగూడెం కాలువలో వ్యక్తి గల్లంతు

నిడదవోలు, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : సమిశ్రగూడెంలోని లోహియానగర్ వద్ద గల కాలువలో బుధవారం స్నానానికి దిగిన వెంకట రమణ (62) గల్లంతయ్యాడు. కాగా, దీనిపై వెంకటరమణ భార్య దుర్గాభవాని ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి ఫైర్‌సిబ్బంది సహకారంతో కాలువలో పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు.

సత్యసాయి శతజయంతి ఉత్సవాలు



సత్యసాయి మందిరంలో వ్రతాలు చేస్తున్న భక్తులు

నిడదవోలు, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని సత్యసాయిబాబా మందిరంలో బుధవారం భగవాన్ శ్రీ సత్యసాయి శత జయంతి సందర్భంగా భక్తులు సత్యసాయి వ్రతాన్ని ఘనంగా నిర్వహించారు. సత్యసాయి జన్మించి 100 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా కార్యక్రమం జరిగింది.

సామూహిక సత్యనారాయణ వ్రతాలు



వ్రతాలు ఆచరిస్తున్న మహిళలు

తాళ్లపూడి, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : కార్తీకమాసం సందర్భంగా తాళ్లపూడి పుష్కరాలరేవు వీధిలోని గౌతమేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో బుధవారం సామూహిక సత్యానారాయణ వ్రతాలు, కార్తీక వన సమారాధనను నిర్వహించారు. కమిటీ ప్రధాన సభ్యుడు కవల శ్రీనివాస్ పాల్గొని మాట్లాడుతూ కొన్ని సంవత్సరాలుగా కీ.శే. సాధువు, సావిత్రమ్మ ఆధ్వర్యంలో సాగిన అన్నదాన కార్యక్రమాలను టీటీడీ ధర్మ ప్రచారక్ పకస రాధాకృష్ణ పర్యవేక్షణలో గ్రామస్థుల సహకారంతో కమిటీ నిర్వహిస్తోందన్నారు. శ్రీ రమా సత్యనారాయణ స్వామి వ్రతాలకు కావలసిన సామగ్రిని రేకపల్లి వీరాస్వామి దంపతులు అందించారన్నారు. భారీ అన్న సమారాధనలో 4000 మంది భక్తులు పాల్గొన్నారు. కమిటీ సభ్యులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

'అన్నదాత' డబ్బులు పడకపోతే సచివాలయాలను సంప్రదించండి



కాకరపర్రు సచివాలయంలో రైతుల లిస్టు విడుదల చేస్తున్న దృశ్యం

పెరవలి, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ నిధులు విడుదలైన సందర్భంగా ఆయా గ్రామాల్లోని రైతులు రైతు సేవా కేంద్రాలకు వెళ్లి వారి పేర్లను చూసుకున్నారు. ఈ సందర్భంగా పాల్గొన్న కూటమి నాయకులు మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు ఎన్నికల్లో ఇచ్చిన మాట ప్రకారం రైతులకు రెండో విడత సొమ్ములు జమ చేశారని, ఒకవేళ ఎవరైనా రైతులు డబ్బులు పడకపోతే స్థానిక సచివాలయాలను సంప్రదించాలని సూచించారు.

ఆర్వోబీ కాంట్రాక్టర్ వైఖరిపై నిరసన



సమిశ్రగూడెం ఆర్వోబీ నిర్మాణ పనుల వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న గ్రామస్థులు

నిడదవోలు, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): శివాలయం, రేవు ధ్వంసానికి ఆర్వోబీ నిర్మాణ పనులు చేపడుతున్న కాంట్రాక్టరే బాధ్యుడని సరైన వివరణ నష్టపరిహారం చెల్లించేవరకు పనులు నిలుపుదల చేయాలని సమిశ్రగూడెం గ్రామస్థులు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం గ్రామంలోని పురాతన శివాలయం వద్ద పనులను నిరసిస్తూ వారంతా నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారంతా మాట్లాడుతూ పురాతన శివాలయం, రేవు ధ్వంసానికి ఆర్వోబీ కాంట్రాక్టర్ ,అధికారుల నిర్లక్ష్య వైఖరే కారణమన్నారు. సరైన వివరణ ఇచ్చి నష్టపరిహారం చెల్లించే వరకు శివాలయం పరిసరాల్లో పనులు నిలుపుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సమిశ్రగూడెం గ్రామస్థులు పాల్గొన్నారు.

క్లీన్ అండ్ గ్రీన్ విలేజ్ కార్యక్రమం



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో రాజ్‌మనోహర్

గోపాలపురం,నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): పరిసరాల పరిశుభ్రతకు క్లీన్ అండ్ గ్రీన్ విలేజ్ కార్యక్రమం ఎంతగానో ఉపయోగపడుతుందని ఎంపీడీవో రాజ్‌మనోహర్ అన్నారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయం సమావేశ మందిరంలో ఏవో మంగతాయారు అధ్యక్షతన బుధవారం క్లీన్ అండ్ గ్రీన్ విలేజ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. సర్పంచ్‌లు, ఉప సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు, తదితరులు పాల్గొన్నారు. అనంతరం గాంధీ, బీఆర్ అంబేడ్కర్ చిత్రపటాలకు పూలమాలలు వేశారు.

రైతు సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం



నిడదవోలులో అన్నదాత సుఖీభవ చెక్కును అందిస్తున్న మంత్రి

నిడదవోలు, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో రైతు సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. బుధవారం నిడదవోలు పట్టణంలోని రోటరీ ఆడిటోరియంలో అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ నిధుల విడుదల కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న మంత్రి మాట్లాడుతూ నిడదవోలు నియోజకవర్గంలో ధాన్యం సేకరించిన రైతుల ఖాతాల్లో ఈ దఫా 157.20 కోట్లను ప్రభుత్వం జమ చేసిందని, అలాగే పీఎం కిసాన్, అన్నదాత సుఖీభవ పథకం రెండోవిడత కింద నియోజకవర్గంలో 19,368 మంది రైతుల ఖాతాల్లో రూ.12.94 కోట్లు జమయ్యాయన్నారు. కూటమి ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తుందని, ఇచ్చిన మాట ప్రకారం ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు, డిప్యూటి సీఎం పవన్ నాయకత్వంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా పనిచేస్తున్నాయన్నారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ మేఘస్వరూప్, అగ్రికల్చరల్ ఏడీ సీహెచ్ శ్రీనివాసరావు, అగ్రికల్చర్ ఏవోలు జి.సత్యనారాయణ, బీ. రాజారావు, ఎం.కిరణ్, రైతులు కూటమి నాయకులు అధికారులు పాల్గొన్నారు.

రైతుల ఆర్థికాభివృద్ధికి కృషి

చాగల్లు: కూటమి ప్రభుత్వం రైతుల ఆర్థికాభివృద్ధికి కృషి చేస్తోందని ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. బుధవారం నెలటూరు శ్రీసీతారామస్వామి, ఎన్టీఆర్ కల్యాణ మండపంలో నియోజకవర్గ స్థాయిలో అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ పథకం నిధుల చెక్కును అందజేశారు. ఈసందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వంలో రైతులు తీవ్ర నిర్లక్ష్యానికి గురయ్యారని చెప్పారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత ధాన్యం కొనుగోలు చేసిన 24 గంటల్లోనే వారి ఖాతాల్లో జమ చేస్తున్నట్టు చెప్పారు. రైతులకు మేలు చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం అన్నదాత సుఖీభవ నిధులు విడుదల చేసిందన్నారు. ఆర్డీవో రాణీసుస్మిత మాట్లాడుతూ రైతులు ఎరువులు, క్రిమిసంహారక మందులు విచ్చలవిడిగా వినియోగించే విధానం మానుకోవాలన్నారు. నియోజకవర్గంలోని రైతులు 22,220 మందికి సంబంధించి రూ. 998.30 లక్షల నిధులు చెక్కు రూపంలో రైతులకు విడుదల చేశారు. కార్యక్రమంలో నియోజకవర్గ పరిశీలకుడు గొర్రెల శ్రీధర్, అర్బన్ బ్యాంక్ చైర్మన్ మద్దిపట్ల శివరామకృష్ణ, ఏఎంసీ చైర్మన్ నాదెళ్ల శ్రీరామ్ చౌదరి, మాజీ ఏఎంసీ చైర్మన్ ఆళ్ల హరిబాబు, సర్పంచ్ యడ్లపల్లి ఉమా రజని, ఎంపీపీ కాకర్ల నారాయుడు, టీడీపీ నాయకులు సూరపనేని చిన్ని, కరుటూరి సతీష్, తాళ్ళూరి ప్రసాద్, బీజేపీ నాయకులు పిక్కి నాగేంద్ర, తాళ్లూరి వరప్రసాద్, ముత్యాలరావు, గ్రంధి రాంబాబు, మండల వ్యవసాయ అధికారులు కే. వేణు గోపాలకృష్ణ, ఏ. గం గాధర్, తహశీల్దార్ ఎం. మెరికమ్మ, ఎంపీడీవో ఆర్. శ్రీదేవి, తదితరులు పాల్గొన్నారు.

ఉండ్రాజవరం: రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం కృషిచేస్తోందని ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ చైర్మన్, మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ ఇన్‌చార్జి బూరుగుపల్లి శేషారావు పేర్కొన్నారు. బుధవారం పసలపూడి రైతు సేవా కేంద్రంలో రెండో విడత అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ పథకం కింద రైతులకు మంజూరైన చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా శేషారావు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభు త్వాలు రైతుల సంక్షేమానికి కట్టుబడి ఉన్నాయన్నారు. కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు సింహాద్రి రామకృష్ణ, నాయకులు కాకర్ల బాపయ్య, బలుసు వెంకటరత్నం, నందిన శ్రీనివాస్, ఆచంట సాయి, ఇతర నాయకులు పాల్గొన్నారు. అలాగే చివటంలో నిడదవోలు ఏఎంసీ చైర్మన్ గాలింకి జిన్నాబాబు ఆధ్వర్యంలో రైతులకు చెక్కులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు పాండురంగ, వేముల సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.



నెలటూరులో రైతులకు చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే ముప్పిడి, ఆర్డీవో, తదితరులు



పసలపూడి సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే బూరుగుపల్లి శేషారావు

మహిళలు అన్నిరంగాల్లో రాణించాలి

● మున్సిపల్ చైర్‌పర్సన్ రత్నకుమారి



చైర్‌పర్సన్‌ను సత్కరిస్తున్న గ్రంథాలయాధికారి సుగుణకుమారి, తదితరులు

కొవ్వూరు, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): మాజీ ప్రధాని ఇందిరాగాంధీని మహిళలు ఆదర్శంగా తీసుకోవాలని మున్సిపల్ చైర్‌పర్సన్ బావన రత్నకుమారి అన్నారు. పట్టణంలోని శాఖా గ్రంథాలయంలో బుధవారం మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని గ్రంథాలయాధికారి కె.సుగుణకుమారి ఆధ్వర్యంలో మహిళా సాధికారిత కార్యక్రమాన్ని నిర్వహించారు. దీనికి ముఖ్య అతిథిగా హాజరైన చైర్‌పర్సన్ ముందుగా ఇందిరాగాంధీ జయంతిని పురస్కరించుకుని ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. అనంతరం మాట్లాడుతూ నేటి సమాజంలో మహిళలు పురుషులతో సమానంగా అన్ని రంగాల్లో రాణిస్తున్నారన్నారు. పీఎం ఎంఎం హైస్కూల్ ఉపాధ్యాయురాలు చెరుకూరి వెంకట శివకుమారి మాట్లాడుతూ విద్యార్థులు చిన్నతనం నుంచి గ్రంథాలయాలలో ఉన్న పుస్తక పఠనం చేయడం ద్వారా ఎందరో దేశ నాయకుల జీవితచరిత్రలతో ప్రపంచ జ్ఞానాన్ని పెంపొందించుకోవచ్చునన్నారు. అనంతరం విద్యార్థులకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

ఇందిరా గాంధీకి ఘన నివాళి

కొవ్వూరు, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): కొవ్వూరులో మాజీ ప్రధాని ఇందిరాగాంధీ జయంతిని ఘనంగా నిర్వహించారు. బుధవారం స్థానిక మెరకవీధిలో ఆమె విగ్రహానికి కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు బచ్చు బుజ్జిబాబు పూలమాల వేసి నివాళి అర్పించారు.



కొవ్వూరులో ఇందిర విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పిస్తున్న బుజ్జిబాబు

నిడదవోలులో ...



నిడదవోలులో నివాళి అర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు

నిడదవోలు, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : స్వర్గీయ మాజీ ప్రధాని ఇందిరాగాంధీ నేటికీ అందరి హృదయాల్లో చిరస్థాయిగా నిలిచే ఉన్నారని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి మేడవరపు భద్రం దొర అన్నారు. బుధవారం పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యా లయంలో ఇందిరాగాంధీ 108వ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. భద్రం దొర మాట్లాడుతూ ఉక్కు మహిళగా ఇందిరాగాంధీ పేరు గాంచారని, అలాగే బడుగు, బలహీన వర్గాల సంక్షేమానికి ఎన్నో సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టారన్నారు. కార్యక్రమంలో చిన్నం మురళీకృష్ణ, బండి అభిశక్తుడు, భావన రమేష్, షేక్‌బషీర్, కాకి కిషోర్, వెంకన్న, ధరణీపతి పాల్గొన్నారు.

తాళ్లపూడి: పైడిమెట్ట మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో బుధవారం ఇందిరా గాంధీ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు దున్నా దుర్గారావు మాట్లాడుతూ ఇందిరాగాంధీ దేశానికి ఎంతో సేవ చేశారని కొనియాడారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు పలు పోటీలు



సమావేశంలో మాట్లాడుతున్న ఓ ఉపాధ్యాయుడు

పెరవలి, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా బుధవారం పెరవలి, ముక్కామల, తీపర్రు గ్రంథాలయాల వద్ద మహిళా దినోత్సవంలో భాగంగా మహిళలకు వివిధ పోటీలు నిర్వహించారు. తీపర్రులో జరిగిన కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయురాలు తోట అచ్చమాంబ, గ్రంథాలయ కమిటీ సభ్యురాలు మిరియాల ధనప్రియ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఇందిరా గాంధీ విగ్రహానికి పూలమాలలు వేశారు. గ్రంథాలయ కమిటీ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు గ్రంధి శ్రీరామచంద్రరావు, బోగవల్లి నాగేశ్వరరావు, కంటిపూడి సూర్యనారాయణ, సింహాద్రి సత్యనారాయణ, నందమూరి నారాయణరావు, ప్రత్తిపాటి ప్రసాద్ కుమార్, గ్రంథాలయ అధికారి విజయలక్ష్మి పాల్గొన్నారు. ముక్కామలలో జరిగిన కార్యక్రమంలో ఉపాధ్యాయురాలు అరుణ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఉపాధ్యాయులు రమాదేవి, పుష్పావతి, నిడదవోలు జాన్సీ, కడియాల సాయి రామారావు, గ్రంథాలయ అధికారి ఎం. వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

సర్పంచ్‌లు సమన్వయంతో పనిచేయాలి : ఎంపీపీ



శిక్షణ తరగతుల్లో పాల్గొన్న ఎంపీడీవో కాకర్ల నారాయుడు

కొవ్వూరు, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): పారిశుధ్య నిర్వహణలో సర్పంచ్‌లు, కార్యదర్శులు సమన్వయంతో పనిచేయాలని ఎంపీపీ కాకర్ల నారాయుడు అన్నారు. కొవ్వూరు మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల ఆధ్వర్యంలో పంచాయతీ సర్పంచ్‌లు, ఉపసర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులకు క్లీన్ అండ్ గ్రీన్‌పై శిక్షణ తరగతులు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎంపీపీ మాట్లాడుతూ గ్రామాల్లో పారిశుధ్య సమస్య తలెత్తకుండా చూడాలన్నారు. అలాగే డ్రైనేజీలను ఎప్పటికప్పుడు శుభ్రపరచడం, ఇంటింటా సేకరించిన చెత్తను డంపింగ్ యార్డులకు తరలించాలన్నారు. పారిశుధ్య రహిత మండలంగా కొవ్వూరు మండలాన్ని ఆదర్శవంతంగా తీర్చిదిద్దాలన్నారు. ఎంపీడీవో టీబీవీ రమణ, కె.బాల నాగులు క్లీన్ అండ్ గ్రీన్‌పై పాటించవలసిన నియమ నిబంధనలను వివరించారు. కార్యక్రమంలో జడ్పీటీసీ బొంతా వెంకటలక్ష్మి, మండలంలోని సర్పంచ్‌లు, ఉప సర్పంచ్‌లు, పంచాయితీ కార్యదర్శులు, తదితరులు పాల్గొన్నారు.

త్వరలో సొసైటీల సేవలు కంప్యూటరీకరణ

ఉండ్రాజవరం, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): సొసైటీల్లో అన్నిరకాల సేవలు త్వరలో కంప్యూటరీకరణ జరుగుతుందని జిల్లా సహకార అధికారి ముళ్లపూడి వెంకటరమణ తెలిపారు. 72వ అఖిలభారత సహకార సంఘాల వారోత్సవాలు సందర్భంగా బుధవారం పాలంగి సొసైటీ వద్ద జరిగిన సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడారు. వివిధ రకాల సేవలకు గాను సభ్యులు చెల్లించే ప్రతి రూపాయికి రశీదు పొందాలన్నారు. వచ్చే ఏడాది ఏప్రిల్ 1 నుంచి సొసైటీల ద్వారా లావాదేవీలు డిజిటలైజేషన్ చేయడం జరుగుతుందని వివరించారు. సొసైటీల ద్వారా డిపాజిట్‌దారులకు నమ్మకం కలిగించే బాధ్యత సొసైటీ అధ్యక్షులు, సెక్రటరీలపై ఉందన్నారు. సీనియర్ సభ్యులు, అధిక డిపాజిట్లు కలిగిన సభ్యులను డీసీవో వెంకటరమణ, ప్రెసిడెంట్ కాకర్ల నాని శాలువా కప్పి సత్కరించారు. అనంతరం సొసైటీ ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరాన్ని నిర్వహించారు. వైద్యులు రోగులను పరీక్షించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వారోత్సవాల ఇన్‌చార్జి ఆదిమూలం వెంకటేశ్వర్లు, సొసైటీ సెక్రటరీ విష్ణుమూర్తి, కూటమి నాయకులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

మత్స్యకారుల వ్యాపారాభివృద్ధికి ప్రభుత్వం అండ : మంత్రి దుర్గేష్



నిడదవోలులో పీఎం మత్స్య సంపద యోజన చెక్కును అందిస్తున్న మంత్రి దుర్గేష్

నిడదవోలు, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): దేశంలో మత్స్యకారుల ఆదాయాన్ని రెట్టింపు చేసే లక్ష్యంతో మత్స్య రైతులు, మత్స్యకారులను సహకార సంఘాల నుంచి సమృద్ధివైపు నడిపించేందుకు ప్రధాన మంత్రి మత్స్య సంపద యోజన ద్వారా వారికి ఆర్థిక భరోసా కల్పిస్తున్నామని రాష్ట్ర మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. బుధవారం నిడదవోలు పట్టణంలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో కోరుమామిడి దివడ్డీస్ ఫిషర్‌మెన్ కో ఆపరేటీవ్ సొసైటీకి రూ. 2.54 లక్షల చెక్కును అందించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ వంద మంది కన్నా ఎక్కువ ఉన్న మత్స్యకార సొసైటీలకు సంఘ కార్యకలాపాల కోసం సంవత్సరానికి రూ. 2.5 లక్షలు ఇస్తున్నామని తెలిపారు. సీఎం చంద్రబాబు , డిప్యూటీ సీఎం పవన్ ఆదేశాలతో ఈ సొసైటీకి ఖర్చుల నిమిత్తం నిధులు రావడం జరిగిందన్నారు. రాష్ట్రంలో ఇదే ప్రథమమని ఆయన తెలిపారు. ఈ నిధుల ద్వారా కార్యాలయ నిర్మాణానికి, ఫర్నిచర్ ఏర్పాటుకు, మేనేజ్మెంటు చేసే సిబ్బంది వేతనానికి వినియోగించుకోవచ్చునన్నారు. ప్రతి మత్స్యకారుడు నేషనల్ ఫిషరీ డెవలప్మెంట్ ప్లాట్ ఫామ్‌లో రిజిస్టర్ అయివుండాలని, అలా అయి వున్నవారికి వ్యక్తిగత రుణాలు, క్రెడిట్ గ్యారెంటీ సదుపాయం అందుతుందన్నారు. కార్యక్రమంలో కోరుమామిడి మత్స్యకార సంఘాల ప్రతినిధులు, అధికారులు, కూటమి నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

'శివాలయ నిర్మాణానికి అనుమతించేది లేదు'



పంచాయతీ కార్యదర్శి అరుణకు వినతిపత్రమిస్తున్న సద్గొండ రజకులు

గోపాలపురం, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : తమ ఉపాధి కోసం కేటాయించిన చెరువు సమీపంలో శివాలయం నిర్మాణానికి అనుమతించేది లేదని సద్గొండకి చెందిన రజకులు బుధవారం సచివాలయం వద్ద బైఠాయించారు. దీనిలో భాగంగా సిబ్బందిని సచివాలయంలోకి వెళ్లకుండా అడ్డుకు న్నారు. దీంతో సర్పంచ్ ఎండపల్లి శేఖర్‌బాబు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్సై మనోహర్ తన సిబ్బందితో చేరుకుని రజకులతో మాట్లాడారు. అనంతరం రజక సంఘం అధ్యక్షుడు కొంజార ఏడుకొండలు, ఉపాధ్యక్షుడు అడవి పోసియ్య, కార్యదర్శి ఉప్పుల సుబ్రహ్మణ్యం, రజక సంఘ సభ్యులు, సచివాలయ కార్యదర్శి అరుణకు వినతిపత్రం అందజేశారు.

పరిసరాల పరిశుభ్రతకు సహకరించాలి

● ఉండ్రాజవరం ఎంపీడీవో ఎం. శ్రీనివాస్

ఉండ్రాజవరం, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): ప్రతిఒక్కరూ పరిసరాల పరిశుభ్రతకు సహకరించాలని ఎంపీడీవో ఎం. శ్రీనివాస్ పేర్కొన్నారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పచ్చదనం, పరిశుభ్రతపై ఒక రోజు శిక్షణ నిర్వహించారు. ఎంపీడీవో మాట్లాడుతూ వ్యక్తిగత పరిశుభ్రతతోపాటు సామాజిక పరిశుభ్రతకు కృషిచేయాలని కోరారు. శిక్షణ కార్యక్రమాల జిల్లా సమన్వయకర్త ప్రసంగిరాజు మాట్లాడుతూ గ్రామాల్లో ప్లాస్టిక్ వాడకం వల్ల వచ్చే ప్రమాదాల గురించి విస్తృతంగా ప్రచారం చేయాలని సూచించారు. గ్రామాల్లో సేకరించే తడి, పొడిచెత్త గురించి ఆయన వివరించారు. అలాగే తడి చెత్త నుంచి సేంద్రియ ఎరువులు తయారీ గురించి వివరించారు. కార్యక్రమంలో ఆఫీసు ఏవో వీఎస్ రామారావు, మండల శానిటేషన్ కోఆర్డినేటర్ కె. ప్రకాశ్, సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

స్వదేశీ వస్తువులనే ప్రతిఒక్కరూ వాడాలి

● బీజేపీ జిల్లా అధ్యక్షుడు పిక్కి నాగేంద్ర



సమావేశంలో మాట్లాడుతున్న నాగేంద్ర, పక్కన తదితరులు

దేవరపల్లి, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): స్వదేశీ వస్తువులనే ప్రతిఒక్కరూ వాడాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు పిక్కి నాగేంద్ర పేర్కొన్నారు. బుధవారం యర్నగూడెంలో బీజేపీ ఆధ్వర్యంలో స్వదేశీ వస్తువులు వాడాలనే నినాదంతో ఆత్మనిర్భర భారత్ కార్యక్రమంలో భాగంగా పార్టీ కార్యకర్తలకు, నాయకులకు సంకల్ప అభియాన్ నిర్వహించారు. ఈ సందర్భంగా నాగేంద్ర మాట్లాడుతూ మన దేశంలో తయారు చేసిన వస్తువులనే వాడాలని, విదేశీ వస్తువులు తిరస్కరించాలని, ప్రతిఒక్కరూ స్వదేశీ వస్తువులు కొనేవిధంగా అవగాహన కల్పించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బీజేపీ ఓబీసీ మోర్చ అధ్యక్షుడు ఆర్.శ్రీనివాస్, జాతీయ కార్యవర్గ సభ్యుడు సత్తిబాబు, ఆత్మనిర్భర భారత్ జిల్లా కన్వీనర్ వేపకాయల కాశీ, ఎస్సీ మోర్చ జిల్లా అధ్యక్షుడు దున్నా సుమన్‌బాబు, బీజేపీ నాయకులు ముప్పిడి భాస్కరరావు, వెంకటపతిరాజు, తదితరులు పాల్గొన్నారు.

'ప్రతి ఇంటి ఆవరణలో మొక్కలు నాటాలి'



కవులూరులో మొక్కలు నాటుతున్న విద్యార్థులు

నల్లజర్ల, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఇంటి ఆవరణలో మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని వెంకట్రామన్నగూడెం వైయస్ఆర్ ఉద్యాన విశ్వవిద్యాలయం విద్యార్థులు పేర్కొన్నారు. గత మూడురోజులుగా తిమ్మన్నపాలెం, కవులూరులో ఎన్ఎస్ఎస్ కార్యక్రమం ద్వారా పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా కవులూరులో బుధవారం జరిగిన సేవా కార్యక్రమాల్లో ప్రజలకు మొక్కల పెంపకం, వాటి వల్ల జరిగే ప్రయోజనాల గురించి తెలియజేశారు. ప్రతి ఇంటిలో కనీసం 5 మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు ప్రతిఒక్కరూ పాటుపడాలన్నారు. కార్యక్రమంలో కళాశాల డీన్ డాక్టర్ దురాజీరావు, డాక్టర్ ఉమాకృష్ణ, విజ్జి, శివకుమార్, గ్రామస్థులు మెత్యూరి శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

అనంతపల్లిలో గంజాయి కలకలం

● అనంతపల్లి టోల్ ప్లాజా వద్ద 150 కిలోలు పట్టుకున్న పోలీసులు

నల్లజర్ల నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): మండలం అనంతపల్లి టోల్‌ప్లాజా వద్ద గంజాయి రవాణా చేస్తున్న వాహనాన్ని నల్లజర్ల పోలీసులు బుధవారం పట్టుకున్నట్టు తెలిసింది. విశాఖ నుంచి హైదరాబాద్ వెళ్తున్న వాహనంలో రవాణా అవుతున్నట్టు సమాచారం రావడంతో నల్లజర్ల పోలీసులు టోల్‌ప్లాజా వద్ద సీఐ రాంబాబు ఆధ్వర్యంలో తనిఖీలు ప్రారంభించగా, విశాఖ నుంచి వెళ్తున్న వాహనంలో 150 కేజీల గంజాయి ఉన్నట్టు గుర్తించారు. దీనిపై సీఐను వివరణ కోరగా పూర్తి విచారణ జరిపిన అనంతరం వివరాలు తెలియజేస్తామన్నారు.

మూడోవిడత రీసర్వే పనులు వేగవంతం చేయాలి



రీసర్వే పనులు పరిశీలిస్తున్న ల్యాండ్ సర్వే, రికార్డ్స్ డిప్యూటీ డైరెక్టర్ సూర్యారావు

చాగల్లు, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): మూడో విడత భూ రీసర్వే పనులు వేగవంతం చేయాలని ల్యాండ్ సర్వే, భూమి రికార్డ్స్ డిప్యూటీ డైరెక్టర్ కే. సూర్యారావు అన్నారు. బుధవారం ఎస్. ముప్పవరంలో జరుగుతున్న రీసర్వే పనులను ఆయన పరిశీలించారు. ఈ సందరంగా గ్రామ రైతులను క్షేత్రస్థాయిలో కలిసి వారితో మాట్లాడారు. రీసర్వే వల్ల రైతులకు మేలు జరుగుతుందని, రైతు భూ సరిహద్దులు సహా అన్ని వివరాలు సంపూర్ణంగా అర్థవంతంగా ఉంటాయని చెప్పారు. రైతులు దీనికి సహకరించాలని కోరారు. రెవెన్యూ అధికారులు సకాలంలో సక్రమంగా తయారు చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో డీఎస్ఎల్‌వో బీ. లక్ష్మీనారాయణ, ఐవోఎస్ టీ .వెంకటేశ్వరరావు, తహశీల్దార్ ఎం. మెరికమ్మ, సర్వే సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీల్లో ఆర్థిక వనరులు పెంపొందించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ కేవీకే దుర్గారావు

దేవరపల్లి, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): పంచాయతీల్లో ఆర్థిక వనరులు పెంపొందించుకునేందుకు అధికారులు, ప్రజాప్రతినిధులు కృషిచేయాలని ఎంపీపీ కేవీకే దుర్గారావు పేర్కొన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం సుస్థిర అభివృద్ధి, స్వచ్ఛ భారత్, పరిసరాల పరిశుభ్రత పై సర్పంచ్‌లు, గ్రామ కార్యదర్శులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రతపై కార్యదర్శులు ప్రత్యేక దృష్టిపెట్టాలని, డ్రైనేజీల్లో మురుగు తొలగింపు, చెత్త పేరుకుపోకుండా ఉండటం, స్వచ్ఛమైన తాగునీరందించడానికి అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీవో సీహెచ్ నాగార్జునరావు, సర్పంచ్ కడిమి వీరకుమారి, ఈఓపీఆర్డీ వై.రాజారావు, మండల పరిషత్ సూపరింటెండెంట్ శాంతి, సర్పంచ్‌లు, కార్యదర్శులు, తదితరులు పాల్గొన్నారు.